# జర్నలిస్ట్ డైలీ
తెలుగు దినపత్రిక



సంపుటి :12 సంచిక :363 గురువారం 3-9-2026 పేజీలు:8 వెల:3 https://www.epaperjournalistdiary.com/


# మళ్లీ వార్ సెగలు




- భగ్గుమన్న పశ్చిమాసియా
- టెహ్రాన్‌లోని సైనిక స్థావరాలపై అమెరికా దాడులు
- ప్రతీకారేచ్ఛతో రగిలిన ఇరాన్..
- జోర్డాన్, బహ్రెయిన్, ఇరాక్, కువైట్‌లోని యూఎస్ లక్ష్యాలపై ఎటాక్
- హార్ముజ్‌ను ట్రంప్ జలసంధిగా మార్చాలా?
- ప్రజల్ని ప్రశ్నిస్తూ ట్రూత్ సోషల్‌లో ట్రంప్ పోస్ట్

## 4న జీఎస్ఎల్‌వీ-ఎఫ్17 రాకెట్ ప్రయోగం




- తిరుమల శ్రీవారిని దర్శించుకున్న ఇస్రో చైర్మన్ వి.నారాయణన్
- ఈఓఎస్-05 ఉపగ్రహాన్ని కక్ష్యలోకి ప్రవేశపెట్టనున్న ఇస్రో
- జీఎస్ఎల్‌వీ సిరీస్‌లో ఇది 19వ ప్రయోగం
- సతీశ్ ధావన్ స్పేస్ సెంటర్ రెండో లాంచ్ ప్యాడ్ నుంచి ప్రయోగం
- జియో ప్లాట్‌ఫామ్‌పై ప్రయోగిస్తున్న తొలి భారతీయ ఉపగ్రహం ఈఓఎస్-05
- భూమి పరిశీలనకు ఉపగ్రహం ద్వారా కీలక చిత్రాల సేకరణ
- ప్రయోగం విజయవంతం కావాలని శ్రీవారిని దర్శించుకున్న ఇస్రో చైర్మన్



## కాంగ్రెస్‌ను కొందరు కబ్జా చేయాలని చూస్తున్నారు

- "కాంగ్రెస్‌లో కొత్తవాళ్ల పెత్తనాన్ని సహించబోను"
- కోమటిరెడ్డి రాజ్‌గోపాల్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు
- నిజమైన కాంగ్రెస్ కార్యకర్తలకు అన్యాయం జరగదని వ్యాఖ్య
- వైఎస్సార్ స్ఫూర్తితో రాజకీయాల్లోకి వచ్చానని వెల్లడి
- 'సీఎం.. సీఎం' అంటూ కార్యకర్తల నినాదాలపై కీలక వ్యాఖ్యలు

తెలంగాణ బ్యూరో, ప్రతినిధి: మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజ్‌గోపాల్ రెడ్డి మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. దివంగత మాజీ సీఎం వైఎస్ రాజశేఖర్ రెడ్డి వర్ధంతి కార్యక్రమంలో పాల్గొన్న ఆయన.. కాంగ్రెస్ పార్టీలో జరుగుతున్న పరిణామాలపై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. కొత్తగా పార్టీలోకి వచ్చిన కొందరు కాంగ్రెస్‌ను కబ్జా చేసి అధికారం చెలాయించాలని చూస్తున్నారని ఆరోపించారు. అలాంటి ప్రయత్నాలను తాను చూస్తూ ఊరుకోబోనని హెచ్చరించారు. తెలంగాణలో వైఎస్ రాజశేఖర్ రెడ్డికి లక్షలాది మంది అభిమానులు ఉన్నారని రాజ్‌గోపాల్ రెడ్డి అన్నారు. తాము వైఎస్సార్ నిజమైన శిష్యులమని పేర్కొన్నారు.

-మిగతా 2 లో

# 'ఉత్తరాంధ్ర'కు చేరిన 'గోదావరి' జలాలు

సాకారమైన ఉత్తరాంధ్ర దశాబ్దాల కల







- పాయకరావుపేట వద్ద జలహారతి పట్టిన సీఎం చంద్రబాబు
- పోలవరం ప్రాజెక్టు ఎడమ కాలువ ద్వారా ఉత్తరాంధ్ర నేలను తాకిన గోదావరి జలాలు
- పాయకరావుపేట వద్ద నీటికి సాష్టాంగ నమస్కారం చేసిన సీఎం చంద్రబాబు
- తొలి దశలో 2.87 లక్షల ఎకరాలకు సాగునీరు, 5 లక్షల మందికి తాగునీరు
- పలు నదులు, కొండలను దాటుతూ నిర్మించిన కాలువ ఒక ఇంజనీరింగ్ అద్భుతం
- భవిష్యత్తులో 8 లక్షల ఎకరాలకు నీరందించడమే లక్ష్యమని వెల్లడి

పాయకరావుపేట, ఏపీ బ్యూరో, జర్నలిస్ట్ డైరీ : ఉత్తరాంధ్ర దశాబ్దాల కల సాకారమైంది. పోలవరం ప్రాజెక్టు ఎడమ ప్రధాన కాలువ ద్వారా గోదావరి జలాలు ఉత్తరాంధ్ర నేలను తాకాయి. ఈ చారిత్రక ఘట్టానికి అనకాపల్లి జిల్లా పాయకరావుపేట వేదికైంది. ముఖ్యమంత్రి చంద్రబాబు గోదావరి జలాలకు జలహారతి ఇచ్చి, పవిత్ర జలాలను శిరస్సున చల్లుకున్నారు. అనంతరం నేలపై సాష్టాంగ ప్రమాణం ఆచరించి, ఉత్తరాంధ్ర ప్రజల చిరకాల వాంఛ నెరవేరిన క్షణాన తన కృతజ్ఞతను చాటుకున్నారు. ఓ దశలో కాలువ నుంచి నీరు ప్రవహిస్తుంటే, చంద్రబాబు మెడలోని పచ్చ కండువా తీసి గాల్లో గిరగిరా తిప్పి తన ఆనందం వ్యక్తం చేశారు. చంద్రబాబును చూసి మిగతా నేతలు, రైతులు కూడా తమ కండువాలను గాల్లో ఊపుతూ హర్షం వెలిబుచ్చారు.

**శిలాఫలకాన్ని ఆవిష్కరించిన చంద్రబాబు...**

అంతకుముందు, పాయకరావుపేట వద్ద ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో సీఎం చంద్రబాబు శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అనంతరం, నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు రెగ్యులేటర్ బటన్ నొక్కి ఉత్తరాంధ్ర సుజల స్రవంతి పథకంలోకి గోదావరి నీటిని విడుదల చేశారు. దాంతో కాలువలోకి ప్రవేశించిన గోదావరికి చంద్రబాబు జలహారతి పట్టారు. అనంతరం చంద్రబాబు, మరికొందరు రైతులు కూడా రెగ్యులేటర్ ఆన్ చేశారు. ఈ కార్యక్రమానికి మంత్రులు వంగలపూడి అనిత, అచ్చెన్నాయుడు, నారాయణ, కొలుసు పార్థసారథి, కొల్లు రవీంద్ర, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, ఎంపీ సీఎం రమేశ్ తదితరులు హాజరయ్యారు. చంద్రబాబు ఓపెన్ టాపు జీపులో ప్రజలకు అభివాదం చేస్తూ పోలవరం ఎడమ కాలువ వద్దకు చేరుకున్నారు. సీఎంను స్వాగతిస్తూ వివిధ రీతుల్లో కళాకారులు స్వాగతం పలికారు. తప్పెటగుళ్లు, కోలాటం వంటి ప్రదర్శనలతో అలరించారు.

**అద్భుతమైన ఇంజనీరింగ్ విన్యాసం...**

పోలవరం జలాల ప్రయాణం ఒక అద్భుతమైన ఇంజనీరింగ్ విన్యాసం. తూర్పు కనుమలను తొలిచి, ఏలేరు, పంపా, తాండవ, వరాహ, శారద వంటి నదులను దాటుకుంటూ ఈ కాలువను నిర్మించారు. కొన్ని చోట్ల నదుల ప్రవాహానికి ఎగువన అక్విడెక్టులు నిర్మించగా, ఏలేరు నది గర్భం కింద నుంచి సైఫన్ ద్వారా నీటిని తరలించడం ఈ ప్రాజెక్టు ప్రత్యేకత. ఈ కాలువను ఉత్తరాంధ్ర సుజల స్రవంతితో అనుసంధానం చేయడం ద్వారా గోదావరి జలాలు ఉత్తరాంధ్రకు చేరాయి.

2.87 లక్షల ఎకరాలకు సాగునీరు, 5.23 లక్షల మందికి తాగునీరు..


-మిగతా 2 లో

## ఊబర్‌లో 3,300 ఉద్యోగాల కోత..




- రోబోటాక్సీల పోటీ నేపథ్యంలో భారీగా సిబ్బంది తగ్గింపు
- 10 శాతం ఉద్యోగులను తొలగించనున్న ఊబర్
- కొవిడ్ తర్వాత ఇదే అతిపెద్ద ఉద్యోగాల కోత
- మేనేజ్‌మెంట్ స్థాయిలను సరళీకరించేందుకు నిర్ణయం
- సంస్థాగత సంక్లిష్టతను తగ్గించడమే లక్ష్యమన్న సీఈవో
- భవిష్యత్ వృద్ధి, ఆవిష్కరణలకు పొదుపు వినియోగం

# దానం కాదు.. పరిహారం కావాలి




- భారత్, చైనా, అమెరికాతో మాకు ముప్పు
- కాలుష్యాన్ని విపరీతంగా వెదజల్లుతున్నాయి
- ఇటీవలి వరదలకు కారణమయ్యాయి
- ఆ మూడు దేశాలు నష్ట పరిహారం చెల్లించాలి
- నేపాల్ విదేశాంగ మంత్రి డిమాండ్
- విరాసను ఆశ్రయించే దిశగా నేపాల్ పీఎం
- 1,127కు చేరుకున్న మృతుల సంఖ్య
- మూడు నదుల ఉగ్రరూపంతో వరద ముప్పు



## కేసీఆర్ రాజీనామా చేస్తే సోనియానే వణికింది..

నీకు తట్టుకునే దమ్ముందా? రేవంత్‌పై కేటీఆర్ ఫైర్

- కేసీఆర్ రాజీనామాలతోనే తెలంగాణ సాధ్యమైందన్న కేటీఆర్
- రాజీనామా చేస్తే ఢిల్లీ గడగడా వణికిందని వ్యాఖ్య
- సోనియా గాంధీ తట్టుకోలేక తెలంగాణ ఇచ్చారంటూ విమర్శ
- కేసీఆర్ రాజీనామాపై రేవంత్ పదేపదే మాట్లాడటంపై ఆగ్రహం
- "నీ నుంచి అయితదా రేవంత్?" అంటూ కేటీఆర్ సూటి ప్రశ్న
- పనికిమాలిన మాటలు మాని.. పనికొచ్చే పని చేయాలని హితవు

హైదరాబాద్

ఉద్యమ నాయకుడు, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు రాజీనామాలు కొత్త కాదు. ఆయన రాజీనామా చేస్తేనే ఢిల్లీనే దిగివచ్చి ప్రత్యేక రాష్ట్రం ఇచ్చిందని కేటీఆర్ అన్నారు. బుధవారం మాజీ మంత్రి హరీశ్ రావుతో కలిసి సీఎం రేవంత్ రెడ్డి 1000 రోజుల దగా పాలనపై తెలంగాణ భవన్‌లో 'ఛార్జ్ షీట్'ను విడుదల అనంతరం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. మాటిమాటికి రేవంత్ రెడ్డి కేసీఆర్ రాజీనామా చేయాలని అసందర్భంగా మాట్లాడుతున్నాడు. కేసీఆర్ రాజీనామా చేస్తే ఢిల్లీ గడగడా వణికింది. వీపు పుగులతదని అర్థమై తప్పని సరి పరిస్థితుల్లో చివరికి మీ నాయకురాలు సోనియా గాంధీ తెలంగాణ ఇచ్చింది. కేసీఆర్ రాజీనామా

-మిగతా 2 లో




## రామ మందిరం తొలి సీఈవోగా జితేంద్ర మిశ్రా

ఆపరేషన్ సిందూర్‌లో వెస్టర్న్ ఎయిర్ కమాండ్ చీఫ్‌గా సేవలు

- జితేంద్ర మిశ్రా నియామకానికి శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ ఆమోదం
- ఎయిర్ మార్షల్‌కు కీలక బాధ్యతలు
- విరాళాల చోరీ ఆరోపణల నేపథ్యంలో ట్రస్ట్ సమావేశం
- ముగ్గురు కొత్త ట్రస్టీల నియామకం
- మహేష్ భాగ్‌చంద్కా, మదన్ మోహన్ పాండే, నిర్మలా యాదవ్‌కు చోటు
- రామ మందిర నిర్వహణలో సీఈవోది కీలక పాత్ర
- దేశ ప్రజలకు సేవ చేసే అవకాశం దక్కడం గర్వంగా ఉందన్న జితేంద్ర మిశ్రా

# బీసీ మహిళ కాబట్టే కుట్రలు

అందుకే టార్గెట్ చేశారు

- అన్ని విషయాలు ఖర్గేకు వివరించా
- నా కూతురు వ్యాఖ్యలకు నన్ను బాధ్యురాలిని చేయొద్దు
- నాపై మాట్లాడిన నేతలకూ నోటీసులు ఇవ్వాలని కోరా
- పదవిలో కొనసాగించాలని ఖర్గేను అడిగాను
- మీడియాతో మంత్రి కొండా సురేఖ వెల్లడి



న్యూఢిల్లీ,

బీసీ మహిళను కాబట్టే తనను టార్గెట్ చేశారని మంత్రి కొండా సురేఖ ఆగ్రహం వ్యక్తం చేశారు. తన కూతురు చేసిన వ్యాఖ్యలకు తనను బాధ్యురాలిని చేయడం సరికాదన్నారు. తెలంగాణ కాంగ్రెస్‌లో తనపై కొనసాగుతున్న వివాదానికి తెరదించుకునేందుకు మంత్రి కొండా సురేఖ ఢిల్లీ వేదికగా తన వాదనను హైకమాండ్ ముందు బలంగా వినిపించినట్లు వెల్లడించారు. సమావేశం అనంతరం సాయంత్రం మీడియాతో మాట్లాడుతూ.. బుధవారం మధ్యాహ్నం కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను కలిసి తనకు ఇచ్చిన షోకాజ్ నోటీసు, తనపై వచ్చిన ఫిర్యాదులు, తన కుమార్తె చేసిన వ్యాఖ్యలపై తనను బాధ్యురాలిని చేస్తున్నారని, వాటిపై వివరణ ఇచ్చానన్నారు. అనంతరం రాష్ట్ర కాంగ్రెస్

-మిగతా 2 లో

# ఊబర్‌లో 3,300 ఉద్యోగాల కోత..

**-రోబోటాక్సీల పోటీ నేపథ్యంలో భారీగా సిబ్బంది తగ్గింపు**
**-10 శాతం ఉద్యోగులను తొలగించనున్న ఊబర్**
**-కొవిడ్ తర్వాత ఇదే అతిపెద్ద ఉద్యోగాల కోత**
**-మేనేజ్‌మెంట్ స్థాయిలను సరళీకరించేందుకు నిర్ణయం**
**-సంస్థాగత సంక్లిష్టతను తగ్గించడమే లక్ష్యమన్న సీఈవో**
**-భవిష్యత్ వృద్ధి, ఆవిష్కరణలకు పొదుపు వినియోగం**

**న్యూఢిల్లీ**




రైడ్ హైలింగ్ వ్యాపారంలోకి రోబోటాక్సీల ప్రవేశాన్ని ఎదుర్కొనేందుకు, కొవిడ్-19 మహమ్మారి తర్వాత తన అతి పెద్ద కోతలలో భాగంగా ఊబర్ టెక్నాలజీస్ దాదాపు 3,300 మంది ఉద్యోగులను అంటే 10 శాతం సిబ్బందిని తొలగించనుంది. ఈ కోతల ద్వారా మేనేజ్‌మెంట్ స్థాయిలు సులభతరం అవుతాయని, వేగవంతమైన వృద్ధి సమయంలో నిర్ణయాలు తీసుకోవడంలో సంస్థాగత సంక్లిష్టతను తగ్గిస్తాయని సంస్థ సీఈవో ఖోస్రోషాహి బుధవారం ఉద్యోగులకు రాసిన నోట్‌లో తెలిపారు. కాగా పలు టెక్ ఎగ్జిక్యూటివ్‌ల మాదిరిగా ఖోస్రోషాహి ఈ ఉద్యోగ కోతలకు ఏఐ కారణమని చెప్పలేదు. ఈ నిర్ణయం భవిష్యత్తులో కీలక వృద్ధికి, నూతన ఆవిష్కరణలకు, తిరిగి పెట్టుబడులు పెట్టడానికి అవసరమయ్యే పొదుపును సృష్టిస్తుందని అన్నారు. అమెరికాలో అదిపెద్ద రోబో టాక్సీ ఆపరేటర్ వేమోతో ఉబర్‌కు పోటీ పెరుగుతున్నందున ఉబర్ ఈ నిర్ణయం తీసుకున్నదనే వార్త వినిపిస్తోంది.

# కాంగ్రెస్‌ను కొందరు కబ్జా చేయాలని చూస్తున్నారు

మొదటి తరువాయి

వైఎస్సార్ స్ఫూర్తితోనే తాను రాజకీయాల్లోకి వచ్చానని చెప్పారు. రాజకీయాల్లో ఉన్నంత కాలం ఆయన ఆశయాల సాధన కోసం పనిచేస్తానని, వైఎస్సార్‌ను ఎప్పటికీ మరచిపోబోనని అన్నారు. ఎంతమంది కుట్రలు చేసినా, బెదిరింపులకు పాల్పడినా తాను భయపడేది లేదన్నారు. ఎన్నో ఏళ్లుగా కాంగ్రెస్‌ను నమ్ముకున్న నిజమైన కార్యకర్తలకు అన్యాయం జరగకుండా చూస్తానని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కార్యకర్తలు, వైఎస్సార్ అభిమానులు పెద్ద ఎత్తున 'సీఎం.. సీఎం' అంటూ నినాదాలు చేశారు. దీనిపై స్పందించిన రాజ్‌గోపాల్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. 'నన్ను సీఎం.. సీఎం అని పిలుస్తున్నారు. ఆ సమయం గనక వస్తే.. దాన్ని బ్రహ్మదేవుడు కూడా ఆపలేడు' అని అన్నారు. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్‌ను మరోసారి అధికారంలోకి తీసుకొచ్చి 'రాజన్న రాజ్యం' కొనసాగిస్తామని రాజ్‌గోపాల్ రెడ్డి పేర్కొన్నారు.

# కేసీఆర్ రాజీనామా చేస్తే సోనియానే వణికింది..

మొదటి తరువాయి

చేస్తే సోనియా గాంధీనే తట్టుకోలేకపోయింది. నీ నుంచి అయితదా రేవంత్ అని సూటిగా ప్రశ్నించారు. కేసీఆర్ రాజీనామాతోనే రాష్ట్రం వచ్చింది. పనికి మాలిన మాటలు మాటలు మాని పనికొచ్చే పని చేయాలని హితవు పలికారు

# 'ఉత్తరాంధ్ర'కు చేరిన 'గోదావరి' జలాలు



ఈ ప్రాజెక్టుతో తొలి దశలో అనకాపల్లి, విశాఖ, విజయనగరం, పార్వతీపురం, శ్రీకాకుళం జిల్లాల్లోని 2.87 లక్షల ఎకరాలకు సాగునీరు, 5.23 లక్షల మందికి తాగునీరు అందనుంది. భవిష్యత్తులో ఉత్తరాంధ్ర వ్యాప్తంగా 8 లక్షల ఎకరాలకు సాగునీరు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోంది

# రూ. 43 లక్షల వ్యయంతో ఒంగోలు కలెక్టరేట్‌లో 'ప్రత్యేక 'లిఫ్ట్' సౌకర్యం

**-ప్రజా ప్రతినిధులు, అధికారులతో కలిసి ప్రారంభించిన మంత్రి డోలా**
**-కలెక్టరేట్ కి వచ్చే దివ్యాంగులు, వయోవృద్ధులకు తొలగిన ఇబ్బందులు**





**ఒంగోలు, ప్రకాశం బ్యూరో, జర్నలిస్ట్ డైరీ :**
సమాజంలో దివ్యాంగులు, వయోవృద్ధులు స్వతంత్రంగా, ఎవరిపై ఆధారపడకుండా జీవించేలా చూడటంతో పాటు ప్రభుత్వ కార్యాలయాల్లో వారికి సులభతరమైన సేవలు అందించడమే కూటమి ప్రభుత్వ ముఖ్య ఉద్దేశమని రాష్ట్ర సాంఘిక సంక్షేమ, విభిన్న ప్రతిభావంతులు మరియు వయోవృద్ధుల సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా బాల వీరాంజనేయస్వామి స్పష్టం చేశారు.?ప్రకాశం జిల్లా కలెక్టరేట్‌లో రూ. 43 లక్షల అంచనా వ్యయంతో నూతనంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక లిఫ్ట్ సౌకర్యాన్ని మంత్రి, జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు, ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన రావు, సంతనూతలపాడు ఎమ్మెల్యే బి.ఎన్. విజయ్ కుమార్, జాయింట్ కలెక్టర్ కల్పనా కుమారి లతో కలిసి ఘనంగా ప్రారంభించారు.?ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ప్రకాశం జిల్లా కలెక్టరేట్ భవనానికి రోజువారీ పనుల నిమిత్తం, విజ్ఞాపన పత్రాలు సమర్పించేందుకు వచ్చే దివ్యాంగులు, వయోవృద్ధులు పై అంతస్తులకు వెళ్లే క్రమంలో పడుతున్న ఇబ్బందులను నివారించేందుకు ఈ లిఫ్ట్ సౌకర్యాన్ని సమకూర్చినట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వ సాంఘిక సంక్షేమ మరియు సాధికారత మంత్రిత్వ శాఖకు చెందిన 'ఎస్ఐపిడిఏ' పథకం కింద జిల్లా యంత్రాంగం ఈ చర్యలు చేపట్టిందని ఆయన పేర్కొన్నారు.?ఈ ప్రాజెక్టును వేగవంతంగా పూర్తి చేయడానికి ప్రజా ప్రతినిధులు, కలెక్టర్ ఆధ్వర్యంలో యంత్రాంగం వేగంగా ముందడుగు వేసిందని తెలిపారు. ఈ లిఫ్ట్ నిర్మాణం మరియు ఏర్పాటు బాధ్యతలను ఆంధ్రప్రదేశ్ మెడికల్ సర్వీసెస్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఒంగోలు వారు పూర్తి చేశారన్నారు. మొత్తం రూ.43 లక్షల అంచనా వ్యయంతో రూపకల్పన చేసిన ఈ ప్రాజెక్టుకు సంబంధించి, విభిన్న ప్రతిభావంతులు మరియు వయోవృద్ధుల సంక్షేమ శాఖ డైరెక్టర్ ద్వారా మొదటి విడతగా రూ. 23.50 లక్షల నిధులను ప్రభుత్వం ఇప్పటికే విడుదల చేసిందన్నారు.?ఒకేసారి 13 మంది ప్రయాణించేలా రూపొందించిన ఈ లిఫ్ట్ వద్దకు చక్రాల కుర్చీలలో వచ్చే వారు నేరుగా చేరుకునేలా ప్రత్యేకంగా ర్యాంప్ సౌకర్యాన్ని కూడా సమకూర్చారనీ మంత్రి తెలిపారు.?ఇదే సమయంలో జిల్లాలోని దివ్యాంగుల సంక్షేమానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని పునరుద్ఘాటిస్తూ.. ప్రకాశం జిల్లా వ్యాప్తంగా గుర్తించిన సుమారు 28,500 మంది దివ్యాంగులలో అత్యవసర సహాయం అవసరమైన 15,000 మందికి విడతల వారీగా నాణ్యమైన సహాయ పరికరాలను పంపిణీ చేసేందుకు సన్నాహాలు చేస్తున్నామని తెలిపారు. దివ్యాంగులు మరియు వయోవృద్ధుల హక్కులను పరిరక్షించడంలోనూ, వారికి అన్ని రంగాల్లోనూ ప్రాధాన్యత కల్పించడంలోనూ కూటమి ప్రభుత్వం ఎల్లవేళలా ముందుంటుందని మంత్రి తెలియజేశారు.దివ్యాంగ శక్తి పథకం ద్వారా దివ్యాంగులకి ఉచిత బస్సు సౌకర్యం కల్పించామన్నారు. బాపట్లలో డిగ్రీ కళాశాల ఏర్పాటు చేసి వినికిడి లోపం ఉన్న వారికోసం ఏఐ తో కూడిన ప్రత్యేక కోర్సును ప్రవేశపెట్టినట్లు మంత్రి వెల్లడించారు.దివ్యాంగులకి 6 వేలు, పూర్తిగా మంచానికే పరిమితమైన వారికి 15 వేలు పెన్షన్ అందిస్తున్నట్లు మంత్రి చెప్పారు.?ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి వెంకట రమణ,విభిన్న ప్రతిభావంతుల జిల్లా అధికారిణి సువార్త, వివిధ శాఖల అధికారులు, దివ్యాంగుల సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# దానం కాదు.. పరిహారం కావాలి

**-భారత్, చైనా, అమెరికాతో మాకు ముప్పు**
**-కాలుష్యాన్ని విపరీతంగా వెదజల్లుతున్నాయి**
**-ఇటీవలి వరదలకు కారణమయ్యాయి**
**-ఆ మూడు దేశాలు నష్ట పరిహారం చెల్లించాలి**
**- నేపాల్ విదేశాంగ మంత్రి డిమాండ్**
**- ఐరాసను ఆశ్రయించే దిశగా నేపాల్ పీఎం**
**- 1,127కు చేరుకున్న మృతుల సంఖ్య**
**- మూడు నదుల ఉగ్రరూపంతో వరద ముప్పు**




ఖాట్మండ్:
వరద నష్టాలకు పరిహారం చెల్లించాలని చైనా, అమెరికా, భారత్ దేశాలను నేపాల్ డిమాండ్ చేసింది. ప్రపంచంలో పెద్ద మొత్తంలో కాలుష్యాన్ని వెదజల్లే దేశాల్లో ఆ మూడు దేశాలు ముందు వరుసలో నిలిచాయని ఆరోపించింది. భోట్కోసీ నదీ ప్రాంతంలో ఇటీవల చోటుచేసుకున్న ప్రాణాంతక వరదలకు వాతావరణ నష్టపరిహారం కోరింది. ఈ వరదల్లో కనీసం 1,127 మంది మరణించారు. వేలాదిమంది గల్లంతయ్యారు. నేపాల్–చైనా సరిహద్దు దగ్గర భారీ రాత్రి, మంచు కొండచరియలు విరిగిపడటంతో వరదలు వచ్చినట్లు వార్తలు వచ్చాయి. మూడు నదుల్లో నీటి మట్టం ప్రమాదకర స్థాయిని దాటడంతో నేపాల్‌కు వరదముప్పు పొంచి ఉందని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. ఈ నేపథ్యంలో నష్టపరిహారం రాబట్టే విషయంలో ఖాట్మండు గట్టి పట్టుదలతో ఉందని వెల్లడించాయి. నష్టపరిహారం కోసం ఐక్యరాజ్యసమితి సర్వసభ్య సమావేశానికి ప్రధానమంత్రి బలేంద్ర బాలెన్ షా వెళ్లే అవకాశం ఉంది. ఆయన వ్యక్తిగతంగా రసువా వరదలను హైలైట్ చేసి వాతావరణ న్యాయం, నష్టపరిహారం కోరే ప్రతిపాదన ప్రస్తుతం చర్చలో ఉంది. నేపాల్ విదేశాంగ మంత్రి శిశిర్ ఖానాల్ ప్రకారం దేశం సహాయం నుంచి న్యాయం, నష్టపరిహారం వైపు దౌత్య విధానాన్ని మార్చుకుంటోంది. ఇది దానం కాదు, చట్టపరమైన, నైతిక బాధ్యత. ప్రపంచంలో అత్యధిక ఉద్గారాలు విడుదల చేసే దేశాల్లో చైనా మొదటి స్థానంలో, అమెరికా రెండో స్థానంలో, భారత్ మూడో స్థానంలో ఉన్నాయి. నేపాల్ లాంటి హాని కలిగే దేశాలకు నష్టపరిహారం ఇవ్వాల్సిన చారిత్రక బాధ్యత ఈ దేశాలకు ఉందని శిశిర్ ఖానాల్ అన్నారు. ఐక్యరాజ్యసమితి నష్టం, నష్టపరిహార నిధిని కూడా నేపాల్ ఆశ్రయించింది. పునర్నిర్మాణానికి నాలుగు నుంచి ఐదు బిలియన్ డాలర్లు అవసరమవుతాయని అంచనా. సకాలంలో సహాయం పంపినందుకు భారత్, చైనా దేశాలకు ప్రధానమంత్రి బాలెన్ షా కృతజ్ఞతలు తెలిపారు. అయినప్పటికీ వాతావరణ నష్టపరిహారం కోసం అంతర్జాతీయ వేదికలపై పట్టుదలతో వాదిస్తామని విదేశాంగ మంత్రి శిశిర్ ఖానాల్ స్పష్టం చేశారు. హిమాలయ హిమానీనదాలు కరిగిపోతే గంగ, త్రిశూలి వంటి నదులపై ఆధారపడిన 200 కోట్లకు పైగా దక్షిణాసియా ప్రజల నీటి భద్రత శాశ్వతంగా దెబ్బతింటుందని హెచ్చరించారు.

# మళ్లీ వార్ సెగలు

**- భగ్గుమన్న పశ్చిమాసియా**
**- టెహ్రాన్‌లోని సైనిక స్థావరాలపై అమెరికా దాడులు**
**- ప్రతీకారేచ్ఛతో రగిలిన ఇరాన్..**
**- జోర్డాన్, బహ్రెయిన్, ఇరాక్, కువైట్‌లోని యూఎస్ లక్ష్యాలపై ఎటాక్**
**-హార్ముజ్‌ను ట్రంప్ జలసంధిగా మార్చాలా?**
**- ప్రజల్ని ప్రశ్నిస్తూ ట్రూత్ సోషల్‌లో ట్రంప్ పోస్ట్**



వాషింగ్టన్
పశ్చిమాసియా మళ్లీ భగ్గుమంది. అమెరికా, ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు తీవ్ర స్థాయికి చేరుకున్నాయి. మొన్నటి వరకు తగ్గుముఖం పట్టిన ఘర్షణలు మళ్లీ ఉధృతమయ్యాయి. ఇరాన్‌లోని ఇస్లామిక్ రివాల్యూషనరీ గార్డ్ కోర్ప్స్ స్థావరాలు, వైమానిక రక్షణ వ్యవస్థలు, రాడార్ కేంద్రాలు, కమ్యూనికేషన్ మౌలిక వసతులు, సముద్ర సామర్థ్యాలను లక్ష్యంగా చేసుకుని అమెరికా సేనలు భారీ దాడులు జరిపింది. కాగా, ప్రతిగా ఇరాన్ క్షిపణులు, డ్రోన్లతో అమెరికా సైనిక లక్ష్యాలపైకి విరుచుకుపడింది. జోర్డాన్, బహ్రెయిన్, ఇరాక్, కువైట్ ప్రాంతాల్లోని అమెరికా సైనిక స్థావరాలు, అమెరికా ప్రయోజనాలకు సంబంధించిన ప్రాంతాలను ఇరాన్ లక్ష్యంగా చేసుకుని దాడులకు పాల్పడింది. ఈ దాడుల్లో 11 మంది మృతిచెందినట్లు సమాచారం. ఈ దాడులు జులై తర్వాత ఇరుదేశాల మధ్య జరిగిన అత్యంత తీవ్రమైన ప్రత్యక్ష సైనిక ఘర్షణగా మారాయి. ప్రస్తుత ఘర్షణకు హార్ముజ్ జలసంధి కీలక కేంద్రంగా మారింది. ప్రపంచ చమురు రవాణాలో అత్యంత వ్యూహాత్మకమైన ఈ మార్గంలో ఇరాన్ మైన్లను ఏర్పాటు చేయడానికి, వాణిజ్య నౌకలను లక్ష్యంగా చేసుకోవడానికి ప్రయత్నించిందని అమెరికా ఆరోపిస్తోంది. దీనికి ప్రతిస్పందనగా అమెరికా ఇరాన్‌కు చెందిన సముద్ర వనరులు, ఆయిల్ ట్యాంకర్లపై కూడా దాడులు చేసినట్లు తాజా నివేదికలు చెబుతున్నాయి.
ఇరాన్‌లోని సిరిక్ ప్రాంతం సమీపంలో జరిగిన అమెరికా దాడిలో ఓ వివాహ వేడుకకు సంబంధించిన ప్రాంతం దెబ్బతిని పలువురు పౌరులు మరణించినట్లు ఇరాన్ వర్గాలు చెబుతున్నాయి. చిన్నారితో సహా పౌరులు మృతి చెందినట్లు స్థానిక నివేదికలు పేర్కొంటున్నాయి. అయితే అమెరికా మాత్రం పౌరులను లక్ష్యంగా చేసుకుని దాడులు చేయలేదని స్పష్టం చేసింది. పెళ్లింటిపై అమెరికా చేసిన బాంబు దాడులకు ప్రతీకారం తీర్చుకుంటామని ఇరాన్ ప్రతిజ్ఞ పూనింది.
ట్రంప్ జలసంధిగా మార్చేద్దామా?
హార్ముజ్ జలసంధిపై అమెరికాకు దాదాపు పూర్తి నియంత్రణ ఉందని, ఇరాన్ చర్యలను తిరస్కరిస్తూ, టెహ్రాన్‌కు వ్యతిరేకంగా తిరగబడాలని ట్రంప్ పిలుపునిచ్చారు. ఈ వ్యూహాత్మక జలమార్గం అమెరికా సైనిక నియంత్రణలో ఉన్నందున, హార్ముజ్ జలసంధికి ట్రంప్ జలసంధిగా పేరు మార్చాలని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ సూచించారు. ఇప్పుడు ఇది అమెరికా నియంత్రణలోకి వచ్చింది కాబట్టి, మనం హార్ముజ్ జలసంధి పేరును ట్రంప్ జలసంధిగా మార్చాలా??? అమెరికాలాగే, ఇది కూడా మునుపెన్నడూ లేనంత వేడిగా మారుతుంది! అని ట్రూత్ సోషల్‌లో ఒక పోస్ట్‌లో ట్రంప్ రాశారు.

# బీసీ మహిళ కాబట్టే కుట్రలు

మొదటి తరువాయి

వ్యవహారాల ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్‌ను కూడా కలిసి విషయాలన్నీ వివరించినట్లు సురేఖ తెలిపారు. కేసీ వేణుగోపాల్‌ను కలవాలని ప్రయత్నించినప్పటికీ ఆయన బిజీగా ఉండటంతో భేటీ కాలేకపోయానని, తాను ఖర్గేను కలిసి కిందకు వచ్చేలోపి ఆయన వెళ్ళిపోయారని చెప్పారు. ఈ విషయంపై ఖర్గే సానుకూలంగా స్పందించారని తెలిపారు. చూద్దాం అన్నారని, పార్టీలో చర్చించి నిర్ణయం తీసుకుంటామని చెప్పారని సురేఖ వెల్లడించారు. తన కుమార్తె వివాహం జరిగి ఇండిపెండెంట్‌గా జీవిస్తున్న వ్యక్తి అని, ఆమె తన అభిప్రాయాలను స్వేచ్ఛగా వ్యక్తం చేసే హక్కు కలిగి ఉందని, ఆమె మాట్లాడిన దానికి నాకు షోకాజ్ ఇవ్వడం బాధ కలిగించిందని చెప్పారు. బీసీ మహిళగా తాను తన వాదనను అధిష్టానం ముందు చెప్పుకున్నానన్నారు.
తెలంగాణలో బీసీల రాజకీయ ప్రాధాన్యతను కూడా ఆమె ప్రస్తావించారు. తాను మంత్రిగా సమర్థంగా పనిచేస్తున్నానని, తనపై ఎలాంటి అవినీతి ఆరోపణలు లేవని, తనకు అప్పగించిన శాఖలను సమర్థంగా నిర్వహిస్తూ ప్రజలకు సేవ చేస్తున్నానని మంత్రి సురేఖ చెప్పారు. అందువల్ల తనను మంత్రి పదవిలో కొనసాగించాలని ఖర్గే, మీనాక్షినటరాజన్‌ను కోరినట్లు వెల్లడించారు. మరోవైపు తనపై ఫిర్యాదులు చేసిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలపై కూడా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పీసీసీ తనపై కఠిన చర్యలు తీసుకోవాలని సిఫారసు చేసిన అంశంపై స్పందిస్తూ.. తనకు షోకాజ్ ఇవ్వడమే తప్పని, ఫిర్యాదుల ఆధారంగా పీసీసీ ఆ విధంగా సిఫారసు చేసిందని వ్యాఖ్యానించారు.
పార్టీ తననేమీ అడగలేదని, వాళ్లు అడిగినప్పుడు, ఆ సమయంలో పరిస్థితిని బట్టి తన నిర్ణయం ఉంటుంది అని తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి నేరుగా టికెట్లు ఇస్తానని ప్రకటిస్తున్న అంశంపై ప్రశ్నించగా.. అది పార్టీ అంతర్గత వ్యవహారమని, దానిపై తాను వ్యాఖ్యానించబోనని చెప్పారు.

## 4న జీఎస్ఎల్‌వీ-ఎఫ్17
# రాకెట్ ప్రయోగం

**-తిరుమల శ్రీవారిని దర్శించుకున్న ఇస్రో చైర్మన్ వి.నారాయణన్**
**-ఈఓఎస్-05 ఉపగ్రహాన్ని కక్ష్యలోకి ప్రవేశపెట్టనున్న ఇస్రో**
**-జీఎస్ఎల్‌వీ సిరీస్‌లో ఇది 19వ ప్రయోగం**
**-సతీశ్ ధావన్ స్పేస్ సెంటర్ రెండో లాంచ్ ప్యాడ్ నుంచి ప్రయోగం**
**-జియో ప్లాట్‌ఫామ్‌పై ప్రయోగిస్తున్న తొలి భారతీయ ఉపగ్రహం ఈఓఎస్-05**
**-భూమి పరిశీలనకు ఉపగ్రహం ద్వారా కీలక చిత్రాల సేకరణ**
**ప్రయోగం విజయవంతం కావాలని శ్రీవారిని దర్శించుకున్న ఇస్రో చైర్మన్**



తిరుమల
సెప్టెంబర్ 4వ తేదీన జీఎస్ఎల్వీ-ఎఫ్17 రాకెట్‌ను ప్రయోగించనున్నారు. ఈ నేపథ్యంలో ఇస్రో చైర్మన్ వి.నారాయణన్ ఇవాళ తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. జీఎస్ఎల్వీ కేటగిరీలో ఇది 19వ రాకెట్ కావడం విశేషం. ఈ రాకెట్ ద్వారా నింగిలోకి ఈఓఎస్-05 ఉపగ్రహాన్ని తీసుకెళ్లనున్నారు. జియో ప్లాట్‌ఫామ్‌పై ప్రయోగిస్తున్న తొలి భారతీయ ఉపగ్రహం ఈఓఎస్-05 అని నారాయణన్ తెలిపారు.సబ్-జీటీవో కక్ష్యలోకి ఈఓఎస్-05 శాటిలైట్‌ను ప్రవేశపెట్టనున్నారు. సతీశ్ ధావన్ స్పెస్ సెంటర్‌లోని రెండో లాంచ్ ప్యాడ్ నుంచి జీఎస్ఎల్వీ-ఎఫ్17ను ప్రయోగించనున్నారు. దీని పేలోడ్ ఫేరింగ్ 4 మీ డయామీటర్లు ఓగివ్‌గా పేర్కొన్నారు. ఈఓఎస్-05 అనేది ఎర్త్ అబ్జర్వేషన్ స్పేస్‌క్రాఫ్ట్. దీని ద్వారా భూమిను పరిశీలించనున్నారు. జియోసింక్రోనస్ ఆర్బిట్ నుంచి ఈ శాటిలైట్ ఇమేజ్‌లను తీస్తుంటుంది.

# రామ మందిరం తొలి సీఈవోగా జితేంద్ర మిశ్రా

**అయోధ్య, సెప్టెంబర్ 2**
అయోధ్య రామ మందిరం తొలి చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్(సీఈవో)గా మాజీ ఎయిర్ మార్షల్ జితేంద్ర మిశ్రా నియామకాన్ని శ్రీ రామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ బుధవారం ఆమోదించింది. దేవరియాకు చెందిన మిశ్రా ఆపరేషన్ సిందూర్ సమయంలో వెస్టర్న్ ఎయిర్ కమాండ్ అధిపతిగా ఉన్నారు. రామ మందిరంలో విరాళాల చోరీ జరిగినట్టు ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ తన మూడవ సమావేశాన్ని బుధవారం నిర్వహించింది. ఈ సందర్భంగా ముగ్గురు కొత్త ట్రస్టీలను ట్రస్ట్ ప్రకటించింది. వీరిలో ఒక మహిళ కూడా ఉన్నారు.ఢిల్లీకి చెందిన మహేష్ భాగ్‌చంద్కా, అయోధ్య న్యాయవాది మదన్ మోహన్ పాండే,



ఆర్ఎస్ఎస్‌తో సంబంధం ఉన్న షికోహాబాద్‌కు చెందిన నిర్మలా యాదవ్ ట్రస్టీలుగా నియమితులయ్యారు. విశ్వ హిందూ పరిషద్(వీహెచ్‌పీ) మాజీ అధ్యక్షుడు అశోక్ సింఘాల్‌కు బంధువైన మహేష్ భాగ్‌చంద్కా 2020లో రామ మందిర భూమిపూజ సందర్భంగా నిర్వహించిన ధార్మిక కార్యక్రమంలో ఆయన ప్రధాన యజమానిగా వ్యవహరించారు. 2024 జనవరి 22న రామ మందిరంలో ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమంలో కూడా ఆయన యజమానిగా వ్యవహరించారు. దేశ ప్రజలకు సేవ చేసే అవకాశం తనకు ఈ కొత్త బాధ్యతను స్వీకరించేలా ప్రేరణ ఇచ్చిందని జితేంద్ర మిశ్రా(రిటైర్డ్) అన్నారు.

జర్నలిస్ట్ డైరీ
తెలుగు దినపత్రిక

# కాంగ్రెస్ ప్రభుత్వంపై షాద్ నగర్ బీఆర్ఎస్ నేతల నిప్పులు

**-షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే వై అంజయ్య యాదవ్ ఆధ్వర్యంలో 420 అడుగుల భారీ ఫ్లెక్సీతో భారీ నిరసన**

**-వందలాదిగా తరలివచ్చిన బీఆర్ఎస్ శ్రేణులు**

**-కాంగ్రెస్ 1000రోజుల పాలనపై బిఆర్యేస్ చార్జ్ షీట్**




**రంగారెడ్డి జిల్లా బ్యూరో, సెప్టెంబర్ 02 (జర్నలిస్ట్ డైరీ) :**
కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో ప్రజా పాలన కంటే అవినీతి, అసమర్థత, అరాచక పాలన కొనసాగుతోందని బీఆర్ఎస్ నేతలు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వ పాలనపై బీఆర్ఎస్ అధిష్ఠానం విడుదల చేసిన చార్జ్‌షీట్ నేపథ్యంలో రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్‌లో మాజీ ఎమ్మెల్యే వై. అంజయ్య యాదవ్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ శ్రేణులు పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమం నిర్వహించారు.
షాద్‌నగర్ చౌరస్తా నుంచి రోడ్డు పొడవునా సుమారు 420 అడుగుల భారీ ఫ్లెక్సీని ఏర్పాటు చేయడం కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలు, ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో వైఫల్యాన్ని ఎత్తిచూపుతూ ఏర్పాటు చేసిన ఈ భారీ ఫ్లెక్సీతో చౌరస్తా గులాబీమయంగా మారింది. మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి బీఆర్ఎస్ కార్యకర్తలు, నాయకులు, యువత వందలాదిగా తరలివచ్చారు. దీంతో షాద్‌నగర్ ప్రధాన చౌరస్తా పక్కన ఉన్న రహదారి బీఆర్ఎస్ శ్రేణులతో కిక్కిరిసిపోయింది. కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగడుతూ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున




నినాదాలు చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నేతలు మాజీ ఎంపీపీ యువనేత వై రవీందర్ యాదవ్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ వంకాయల నారాయణరెడ్డి, ఎమ్మె సత్యనారాయణ లాంటి నేతలు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయడంలో విఫలమైందని విమర్శించారు. రైతులకు రుణమాఫీ, రైతుబంధు, యూరియా, సాగునీరు వంటి అంశాల్లో ప్రభుత్వం రైతులను ఇబ్బందులకు గురిచేస్తోందని ఆరోపించారు. రాష్ట్రంలో అభివృద్ధి కుంటుపడిందని, ప్రజల సమస్యలను పట్టించుకోకుండా ప్రభుత్వం పాలన సాగిస్తోందని మండిపడ్డారు. ప్రజా సంక్షేమం, అభివృద్ధి పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టిందని బీఆర్ఎస్ నాయకులు ఆరోపించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కాలయాపన చేస్తోందని, ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకే ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. మాజీ ఎమ్మెల్యే వై. అంజయ్య యాదవ్, యువనేత రవీందర్ యాదవ్, పార్టీ నాయకులు ఎం. సత్యనారాయణ, వంకాయల నారాయణరెడ్డి, దేవేందర్ యాదవ్, ఈట గణేష్, అన్ని మండలాల పార్టీ అధ్యక్షులు, ఇతర బాధ్యతలు నిర్వహిస్తున్న నాయకులు, యువత, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. నాయకులు, కార్యకర్తల భారీ రాకతో షాద్‌నగర్ చౌరస్తా కొద్దిసేపు బీఆర్ఎస్ జెండాలు, నినాదాలతో మారుమోగింది.

# కాంగ్రెస్ 1000 రోజుల విఫల పాలనపై తెలంగాణ భవన్‌లో ఛార్జ్ షీట్ విడుదల

**-విడుదల చేసిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**
**-హాజరైన మాజీ మంత్రి హరీష్ రావు**
**-మాజీ మంత్రులు,ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో పాల్గొన్న ఉమ్మడి పాలమూరు ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి**





**తెలంగాణ బ్యూరో సెప్టెంబర్ 02 (జర్నలిస్ట్ డైరీ) :**
రాష్టంలో కాంగ్రెస్ 1000 రోజుల విఫల పాలనపై తెలంగాణ భవన్‌లో ఛార్జ్ షీట్ విడుదల చేసిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్.ఈ కార్యక్రమంలో మాజీ మంత్రులు హరీష్ రావు,తలసాని శ్రీనివాస్ యాదవ్,సబితా ఇంద్రారెడ్డి, మహమూద్ ఆలీ,సత్యవతి రాథోడ్,పొన్నాల లక్ష్మయ్య, ఎమ్మెల్సీలు,నవీన్ కుమార్ రెడ్డి పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి,ఎల్ రమణ,సురభి వాణిదేవి,మాజీ ఎంపీలు రావుల చంద్రశేఖర్ రెడ్డి,మాలోత్ కవిత,కేఆర్ సురేష్ రెడ్డి,మాజీ ఎమ్మెల్సీలు,మాజీ కార్పొరేషన్ ఛైర్మన్లు మరియు బీఆర్ఎస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# అక్రమ మద్యం బాటిళ్లు స్వాధీనం

**-88 అక్రమ మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు**



**ఒంగోలు, ప్రకాశం బ్యూరో, జర్నలిస్ట్ డైరీ :**
అక్రమంగా మద్యం అమ్ముతున్న వ్యక్తి వద్ద నుంచి 88 క్వార్టర్ మద్యం బాటిళ్లను టాస్క్ ఫోర్స్ పోలీసులు స్వాధీనం చేసుకున్న ఘటన కందుకూరు పట్టణంలో మంగళవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే... ప్రకాశం జిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు ఆదేశాలతో టాస్క్‌ఫోర్స్ సీఐ కె. కమలాకర్ ఆధ్వర్యంలో ఎస్ఐ సి.హెచ్. చెంచయ్య, ఏఎస్ఐ షేక్ మహబూబ్ భాష మరియు సిబ్బంది జిల్లా లోని కందుకూరు పట్టణంలో నిన్న అర్ధరాత్రి 12.30 గంటల ప్రాంతంలో స్థానిక సూర్య బార్ అండ్ రెస్టారెంట్ సమీపంలో అక్రమంగా మద్యం అమ్ముతున్న వ్యక్తి వద్ద నుంచి 88 క్వార్టర్ మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు.అక్రమ మద్యాన్ని, అదుపులోకి తీసుకున్న వ్యక్తిని తదుపరి చట్టపరమైన చర్యల నిమిత్తం కందుకూరు టౌన్ పోలీసులకు అప్పగించారు. జిల్లాలో అక్రమ మద్యం విక్రయాలు, అక్రమ రవాణాకు పాల్పడే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు. ఏదైనా సమాచారం ఉంటే స్థానిక పోలీసులకు లేదా డయల్ 112 పోలీస్ వాట్సాప్ నెంబర్ 9121102266 కు సమాచారం అందించాలన్నారు.

# 'నవోదయ'లో 9, 11 వ తరగతులలో మిగిలిన సీట్ల భర్తీకి దరఖాస్తులు

**ఒంగోలు, ప్రకాశం బ్యూరో, జర్నలిస్ట్ డైరీ :**
జవహర్ నవోదయ విద్యాలయంలో 9,11 వ తరగతులలో చేరుటకు వచ్చే విద్యా సంవత్సరానికి సంబంధించి (2027-2028) మిగిలిన సీట్ల భర్తీ కోసం దరఖాస్తులు చేసుకోవాలని నవోదయ విద్యాలయ ప్రిన్సిపాల్ సి.శివరాం బుధవారం ఒక ప్రకటనలో ఆయన తెలిపారు. ప్రకాశం జిల్లా పరిధిలో అన్ని ప్రభుత్వ, ప్రభుత్వం చేత గుర్తింపు పొందిన ప్రైవేట్ పాఠశాలలో 8, 10 వ తరగతి చదువుకున్న విద్యార్థులు విద్యా సంవత్సరం 2026-2027 కు మాత్రమే అర్హులని వారు మాత్రమే ఆన్లైన్ లో లేదా అఫ్ లైన్ దరఖాస్తు చేసుకోవచ్చుని ఆయన తెలిపారు.దరఖాస్తులు కావలిసిన వారు ఒంగోలు జవహర్ నవోదయ విద్యాలయం నందు పొందవచ్చున్నారు. ఈ అడ్మిషన్లకు దరఖాస్తు చేసుకోవాలి అంటే పూర్తి వివరాల కోసం జవహర్ నవోదయ విద్యాలయ ఆఫీస్ నందు సంప్రదించాలని లేదా అధికారిక రిజిస్ట్రేషన్ పోర్టల్ లో చూడాలని తెలిపారు.దరఖాస్తు చేసుకోవడానికి చివరి తేదీ సెప్టెంబర్ 30 వ తేదీ అని తెలిపారు.9 వ తరగతి కోసం :
హెచ్టిటిపిఎస్://సీబీఎస్ఈఐటిఎంఎస్.ఎన్ఐసి.
ఇన్/2026/ఎన్విఎస్ఐఎక్స్‌బి9 మరియు 11 వ తరగతి కోసం :
హెచ్టిటిపిఎస్://సీబీఎస్ఈఐటిఎంఎస్.ఎన్ఐసి.
ఇన్/2026/ఎన్విఎస్ఐఎక్స్‌బి11
పైన తెల్పిన వెబ్సైట్ లలో దరఖాస్తులు చేసుకోవాలని ప్రిన్సిపాల్ తెలిపారు.

# శత్రువులు కూడా అభినందించే గొప్ప నాయకుడు "వైఎస్సార్"

**-షాద్ నగర్ ఎమ్మెల్యే "వీర్లపల్లి శంకర్" షాద్ నగర్ లో వైయస్సార్ వర్ధంతి సందర్భంగా విగ్రహ ఆవిష్కరణ**



**రంగారెడ్డి జిల్లా బ్యూరో, సెప్టెంబర్ 02 (జర్నలిస్ట్ డైరీ) :**
శత్రువులు కూడా అభినందించే గొప్ప నాయకుడు "వైఎస్సార్" అని షాద్ నగర్ ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్"వీర్లపల్లి శంకర్" కొనియాడారు. అదేవిధంగా
తెలుగు ప్రజల గుండెల్లో కొలువైన మహా నాయకుడు వైయస్ రాజశేఖర రెడ్డి అని మరో నేత స్థానిక మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్ రెడ్డి పేర్కొన్నారు. వైయస్ రాజశేఖర్ రెడ్డి వర్ధంతి సందర్భంగా రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ పట్టణంలోని ఫరూక్ నగర్ ప్రభుత్వ ఆసుపత్రి సమీపంలో నూతన వైయస్ విగ్రహాన్ని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన వర్ధంతి సభకు నియోజకవర్గంలోని అన్ని మండలాల నుండి గ్రామాల నుండి పెద్ద ఎత్తున వైయస్ అభిమానులు కాంగ్రెస్ కార్యకర్తలు నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వర్ధంతి సభలో ఎమ్మెల్యే శంకర్ మాట్లాడుతూ.. రాజశేఖర రెడ్డి అంటే సంక్షేమం.. సంక్షేమం అంటే రాజశేఖర రెడ్డి అని కొనియాడాడు.
వైఎస్ రాజశేఖరరెడ్డి 2009వ సంవత్సరం, సెప్టెంబర్ 2వ తేదీన రచ్చబండ కార్యక్రమానికి హాజరవుతూ నల్లమల అటవీ ప్రాంతంలోని పావురాలగుట్టలో జరిగిన హెలికాప్టర్ ప్రమాదంలో మరణించారని, 2004 నుంచి 2009 వరకు ఆయన ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఆరోగ్య శ్రీ, ఫీజు రీయింబర్స్‌మెంట్, రైతులకు ఉచిత విద్యుత్, రుణమాఫీ పథకాలను ప్రవేశపెట్టి ప్రజల గుండెల్లో చిరకాలం నిలిచిపోయారన్నారు. ఆయన మరణించి 17 సంవత్సరాలు అవుతున్నా ప్రజల గుండెల్లో ఇప్పటికీ చెరగని ముద్ర వేశారన్నారు.
మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ..
'తెలుగు ప్రజల గుండెల్లో కొలువైన మహా నాయకుడు వైయస్ఆర్ అని ఆయన యుగానికి ఒక్కడు అని అన్నారు. పేదల కోసం ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేసిన గొప్ప వ్యక్తి వైయస్ఆర్ అని ఆయన అమలు చేసిన పథకాలను దేశంలో ఎన్నో రాష్ట్రాలు అమలు చేశాయన్నారు.
రాజశేఖర్ రెడ్డి భౌతికంగా ప్రజలకు దూరమైనా ప్రజల గుండెల్లో ఆయన కొలువై ఉన్నారనీ అంబులెన్స్ కుయ్ కుయ్ అనే శబ్దంలో ఉన్నారని గుర్తు చేశారు. ' పేదల కోసం ఆరోగ్యశ్రీ ,ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాలను ప్రవేశపెట్టిన మహోన్నత వ్యక్తి వైయస్ఆర్ అని, సంక్షేమానికి సంతకం డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి అని ఆయన ప్రజలకు దూరమై 17 సంవత్సరాలు గడిచినా ప్రజల గుండెల్లో మాత్రం ఆయన కొలువై ఉన్నారు' అని కొనియాడారు. స్థానిక నేత ఇబ్రహీం వైయస్సార్ విగ్రహ ఏర్పాటుకు రాత్రింబవళ్లు కృషి చేసి ఏర్పాటు చేసినందుకు ప్రతాపరెడ్డి అభినందించారు. ఈ సందర్భంగా పక్కనే ఉన్న బాలికల పాఠశాలలో మాజీ ఎమ్మెల్యే ప్రతాప్ రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పండ్లు పంపిణీ చేశారు. వైఎస్సార్ 17 వ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ సభ్యుడు మామిడి శ్యామ్ సుందర్ రెడ్డి, షాద్ నగర్ మున్సిపల్ చైర్మన్ అగ్గనూరు బస్వాం, వైస్ చైర్మన్ అందే మోహన్, మార్కెట్ కమిటీ చైర్మన్ సులోచన కృష్ణారెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్ ఖాన్, కాంగ్రెస్ పార్టీ గిరిజన విభాగం కోఆర్డినేటర్ రఘు నాయక్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బాలరాజు గౌడ్, కొత్తూరు మాజీ ఎంపీపీ శివ శంకర్ గౌడ్, సింగిల్ విండో చైర్మెన్ లు చల్ల శ్రీకాంత్ రెడ్డి, జితేందర్ రెడ్డి, శ్రీధర్ రెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షు లు రాయ్ కల్ శ్రీనివాస్, కుమార స్వామి గౌడ్, పురుషోత్తం రెడ్డి, అన్మగల్ల రమేష్, ఎల్లారం శేఖర్ రెడ్డి,జాకరం చంద్ర శేఖర్,పట్టణ అధ్యక్షుడు నల్ల మోని శ్రీధర్,
మాజీ మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ విశ్వం,కౌన్సిలర్లు రాజు నాయక్, కొప్పునూర్ ప్రవీణ్,కాంగ్రెస్ పార్టీ నేతలు చెంది తిరుపతి రెడ్డి, ఇబ్రహీం, జమ్రుత్ ఖాన్, కొంకల్ల చెన్నయ్య,ధంగు శ్రీనివాస్ యాదవ్, కేకే కృష్ణ, కట్ట వెంకటేష్ గౌడ్,శ్రీను నాయక్, అంబటి ప్రభాకర్, ఖాదర్ ఘోరీ,చంద్ర పాల్ రెడ్డి, కొమ్ము కృష్ణ,జాంగారి రవి, సోలిపుర్ శ్రీశైలం గౌడ్, అన్నారం రాములు గౌడ్,తుపాకుల శేఖర్ ముదిరాజ్, కరుణాకర్, లింగారెడ్డి గూడ అశోక్, ముబరక్, దాకం మనీష్, రవితేజ చిన్న, జాంగారి జంగయ్య, హైదర్ ఘోరీ, లయక్ బాయి,సత్య నారాయణ రెడ్డి, విఘ్నేష్ రెడ్డి,నక్క బాలరాజు యాదవ్, బాలు నాయక్, పుల్లారెడ్డి, లింగరం యాదయ్య,మల్లేష్ గౌడ్, తంగేడ్ పల్లి శంకర్, శర్పొద్దిన్, నిరటి వాసు, గంగనమోని సత్తయ్య, మహిళ కాంగ్రెస్ నేతలు రమాదేవి, నాగమని,సర్పంచులు వెల్జర్ల ఆర్ బాబు నాయక్, గంట్ల వెల్లి మాజీ సర్పంచ్ యాదయ్య, సర్పంచ్ సంఘాల నేతలు కొమ్ము కృష్ణ, శివారెడ్డి, చందు నాయక్, శ్రీను నాయక్, మంకల శ్రీశైలం, శివ రాములు, భాస్కర్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు ,వైఎస్సార్ అభిమానులు పాల్గొన్నారు.

జర్నలిస్ట్ డైరీ
తెలుగు దినపత్రిక

## ఆజాద్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వ్యాసరచన పోటీల విజేతలకు బహుమతి ప్రదానం



యాచారం (సెప్టెంబర్ 02).జర్నలిస్ట్ డైరీ.
ఆజాద్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గత నెల ఆగస్టు 15వ తేదీ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని గవర్నమెంట్ హైస్కూల్లో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో పలువురు విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.పోటీల్లో పాల్గొన్న విద్యార్థులను ప్రోత్సహించే ఉద్దేశంతో బుధవారం బహుమతి ప్రధానోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.ఈ కార్యక్రమంలో ఆజాద్ ఫౌండేషన్ అధ్యక్షులు సంతోష్ గుప్తా, వైస్ ప్రెసిడెంట్ తలారి మహేందర్, గవర్నమెంట్ హైస్కూల్ ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు పాల్గొని విద్యార్థులను అభినందించారు.
విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసి, వారిని విద్యాపరంగా మరియు సృజనాత్మకంగా ప్రోత్సహించేందుకు ఆజాద్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఇటువంటి కార్యక్రమాలను నిరంతరం నిర్వహిస్తామని సంతోష్ గుప్త తెలిపారు.

## పేకాట స్థావరంపై ఒంగోలు టాస్క్ ఫోర్స్ పోలీసుల దాడులు


**-చీమకుర్తి పిఎస్ పరిధిలో చిన్న రావిపాడు గ్రామ శివారులో ముగ్గురు పేకాటరాయుళ్ల అరెస్ట్**
**-రూ.45,200/- నగదు,**
**-3 సెల్ ఫోన్లు, 2 మోటార్ సైకిల్ స్వాధీనం**




చీమకుర్తి, ఒంగోలు, ప్రకాశం బ్యూరో, జర్నలిస్ట్ డైరీ :
ప్రకాశం జిల్లా ఎస్పీ వి.హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా పలు పోలీస్ స్టేషన్ల పరిధిలో అసాంఘిక కార్యకలాపాలపై ఒంగోలు టాస్క్ ఫోర్స్ పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు. ఈ క్రమంలో ప్రకాశం జిల్లా చీమకుర్తి పోలీస్ స్టేషన్ చిన్న రావిపాడు గ్రామం శివారులో బుధవారం మధ్యాహ్నం సమయంలో పేకాట స్థావరంపై టాస్క్ ఫోర్స్ ఇంచార్జ్ సీఐ కమలాకర్ ఆధ్వర్యంలో ఎస్సై బి.వినోద్ బాబు, ఏఎస్ఐ షేక్ మహబూబ్ బాషా మరియు వారి సిబ్బంది ఆకస్మికంగా దాడులు నిర్వహించి ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని, వారి వద్ద నుండి రూ.45,200/-ల నగదు, 3 మొబైల్ ఫోన్లు,రెండు మోటర్ సైకిళ్ళను స్వాధీనం చేసుకున్నారు. వారిపై చట్ట ప్రకారం కేసు నమోదు నిమిత్తం చీమకుర్తి పోలీస్ స్టేషన్లో అప్పగించినట్లు టాస్క్ ఫోర్స్ పోలీసులు తెలిపారు.ఈ సందర్భంగా పేకాట వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలకు దూరంగా ఉండాలని, జూద క్రీడలు మరియు ఇతర అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడేవారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు. జిల్లాలో ఎక్కడైనా ఇలాంటి కార్యక్రమాలకు సంబంధించి సమాచారం ఉంటే, వెంటనే డయల్ 112 నంబర్‌కు లేదా టాస్క్ ఫోర్స్ ఇంచార్జ్ సిఐ 9121102113, పోలీసు వాట్సాప్ నంబర్ 9121102266 కు మెసేజ్ ద్వారా తెలియజేయాలని ప్రజలను కోరారు.

## 'గ్రౌండ్ ట్రూథింగ్', 'రీ సర్వే' ప్రక్రియను గడువు లోపల పూర్తి చేయాలి

**-ప్రకాశం జిల్లా జాయింట్ కలెక్టర్ కల్పనా కుమారి**





టంగుటూరు, ఒంగోలు, ప్రకాశం బ్యూరో, కోస్తా లీడర్
జిల్లా జాయింట్ కలెక్టర్ కల్పనా కుమారి బుధవారం కామేపల్లి గ్రామంలో పర్యటించి రీ సర్వే ప్రక్రియను ప్రత్యక్షంగా పరిశీలించారు అందులో భాగంగా గ్రౌండ్ ట్రూథింగ్ మరియు రీ-సర్వే ప్రక్రియను గడువు లోపల పూర్తిచేయాలని వారం రోజుల లోపల లక్ష్యం పూర్తి చేయాలని సంబంధిత సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో రెవిన్యూ డివిజనల్ అధికారి చంద్రశేఖర్ నాయుడు, సర్వే మరియు సంచాలకులు రమణ, డి ఐ ఓ సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

# భూముల రీ సర్వే తక్షణమే పూర్తి చేయాలి..

**-రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి..**
**-స్మార్ట్ కార్డుల పంపిణీ వేగతరం చేయాలి..**
**-భూభారతి, 22 ఏ విషయంలో దళారుల మాటలు నమ్మొద్దు..**
**-షాద్ నగర్ ఆర్డీవో కార్యాలయంలో అధికారులతో సమీక్షా సమావేశం**



రంగారెడ్డి జిల్లా బ్యూరో, సెప్టెంబర్ 02 (జర్నలిస్ట్ డైరీ) :
ప్రభుత్వం ఆదేశాల మేరకు గ్రామీణ ప్రాంతాలలో భూముల రీ సర్వే కార్యక్రమాలను త్వరితంగా పూర్తి చేయాలని రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి షాద్ నగర్ నియోజకవర్గం లోని రెవిన్యూ అధికారులకు సూచించారు. షాద్ నగర్ పట్టణంలోని ఆర్డీవో కార్యాలయంలో అధికారిని ఎన్ఆర్ సరిత ఆధ్వర్యంలో జరిగిన సమీక్షా సమావేశంలో డివిజన్ పరిధిలోని తహసిల్దారులతో బుధవారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి మాట్లాడుతూ.. ప్రతి డివిజన్లోనూ భూముల రీ సర్వే, ఇతర రెవెన్యూ అంశాలపై రివ్యూ సమావేశాలు నిర్వహించి అధికారులను అప్రమత్తం చేస్తున్నామని వెల్లడించారు. ప్రస్తుతం షాద్ నగర్ నియోజకవర్గ పరిధిలో జిల్లేడు చౌదరిగుడా మండలం తూంపల్లి, ఫరూక్ నగర్ మండలం సూర్యారావు గూడ, కేశంపేట మండలం చింతకుంట లో సర్వే కార్యక్రమాలు నడుస్తున్నాయని వెల్లడించారు. జిల్లావ్యాప్తంగా 6 11 గ్రామాలలో సర్వే నిర్వహించాల్సి ఉండగా ప్రస్తుతం 108 గ్రామాలలో ఈ సర్వే కొనసాగుతుందని వెల్లడించారు. 60 మంది రెవిన్యూ సిబ్బంది నెలకు 560 ఎకరాల చొప్పున సర్వే చేపడతారని స్పష్టం చేశారు. భూభారతి, 22 ఏ ల విషయంలో భూ యజమానులు ఎట్టి పరిస్థితుల్లోనూ బ్రోకర్లను సంప్రదించవద్దని అదనపు కలెక్టర్ సూచించారు. వారు మాటలతో మభ్యపెట్టి మోసాలు చేస్తారని, తమ సమస్యలు రెవిన్యూ అధికారులను కలవడం ద్వారా మాత్రమే పరిష్కరించుకోవాలని పేర్కొన్నారు. అధికారులు భూముల వ్యవహారాలలో చిన్నచిన్న పొరపాట్లు ఉంటే వాటిని సవరించి రిజిస్ట్రేషన్లు జరిగేలా చర్యలు తీసుకుంటారని వెల్లడించారు. ఇందులో భాగంగానే భూభారతిపై ప్రత్యేక నిర్వహించినట్లు వెల్లడించారు. ప్రభుత్వ స్మార్ట్ కార్డులను ప్రియారిటీ పరంగా అర్హులైన అందరికీ అందుబాటులో ఉంచే విధంగా ఏర్పాట్లు జరుగుతున్నాయని స్పష్టం చేశారు. షాద్ నగర్ డివిజన్ పరిధిలో నూతన డీలర్ల ఏర్పాటు కూడా జరుగుతుందని, త్వరలోనే ఖాళీలను భర్తీ చేస్తామని స్పష్టం చేశారు. లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ కు సంబంధించి భూసేకరణలో 191 ఎకరాలకు నోటిఫికేషన్ ఇవ్వడం జరిగిందని, త్వరలోనే భూసేకరణ జరుగుతుందని స్పష్టం చేశారు. ఇక రేడియాల రహదారికి సంబంధించి ఐదు ఎకరాలు మినహా ఎలాంటి ఇబ్బంది లేదని, చర్చల ద్వారా ఈ ఐదు ఎకరాల సేకరణ కూడా పూర్తి చేసి పనులు కొనసాగిస్తామని వెల్లడించారు.

# చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు

**-జిల్లా ఎస్పీ వి.హర్షవర్ధన్ రాజు**
**-ప్రకాశం, మార్కాపురం జిల్లాల్లో పోలీసు శాఖ ఆగస్టు నెల గణాంకాలను వెల్లడించిన ఎస్పీ**



ఒంగోలు/మార్కాపురం, ప్రకాశం బ్యూరో :
ప్రకాశం, మార్కాపురం జిల్లాలలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తూ, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రకాశం, మార్కాపురం జిల్లాల్లో పోలీసులు విస్తృత తనిఖీలు నిర్వహిస్తూ, చట్టవ్యతిరేక, అసాంఘిక కార్యకలాపాలను అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నారన్నారు.ఈ సందర్భంగా ప్రకాశం, మార్కాపురం జిల్లాల్లో పోలీసు శాఖకు సంబంధించి ఆగస్టు నెల గణాంకాలను ఎస్పీ వెల్లడించారు.ఈ మేరకు 1.జిల్లాలో కోడిపందాలు మరియు పేకాట వంటి జూద కార్యకలాపాలపై ప్రత్యేక దాడులు నిర్వహించి మొత్తం 200 మందిని అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా 37 కేసులు నమోదు చేయబడగా, వారి వద్ద నుండి రూ. 7,24,750/- నగదు, 7 కోళ్లు, 19 మోటార్ సైకిళ్లు, 42 మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. 2.ప్రకాశం, మార్కాపురం జిల్లాలలో ఉన్న 814 మంది చెడునడత కలిగిన వారికి (రౌడీ షీటర్ల) కౌన్సిలింగ్ నిర్వహించి, సత్ప్రవర్తనతో అందరితో కలసిపోయి మంచిగా జీవనం సాగించాలన్నారు. వ్యవహార శైలి మార్చుకోకపోయినా, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడిన, చట్టాన్ని అతిక్రమించి దౌర్జన్యాలు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. 3.బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవించిన వారిపై 926 కేసులు నమోదు చేయడం జరిగిందన్నారు. అదేవిధంగా ఇలాంటి కార్యకలాపాలు జరుగుతున్న 935 ప్రదేశాలను శుభ్రపరచడం జరిగిందన్నారు. 4.రోడ్లను ఆక్రమించి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తున్న 143 మందిపై టౌన్ న్యూసెన్స్ యాక్ట్ కింద కేసులు నమోదు చేసి కోర్టులో జరిమానాలు, శిక్షలు విధింపజేశారన్నారు. 5.గంజాయి అక్రమ రవాణాను అరికట్టడంలో భాగంగా 1 కేసు నమోదు చేసి, సుమారు 2.0 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారన్నారు. 6.మోటారు వాహన చట్టం కింద ద్విచక్ర వాహనాలు, కార్లు, ఆటోలపై మొత్తం 8,539 ఈ చలానా ద్వారా కేసులు నమోదు చేసి =S.42,82,910/- జరిమానా విధించారన్నారు.
6.డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో 366 మంది వాహనదారులను పట్టుకుని కోర్టులలో హాజరు పరచగా కోర్ట్ వారు రూ.12,00,000/- లు జరిమానాలు విధించారన్నారు. ఇద్దరు వ్యక్తులకు కోర్ట్ వారు జైలు శిక్ష విధించారన్నారు.
7.జిల్లా వ్యాప్తంగా రాత్రి, పగలు గస్తీ నిర్వహిస్తూ పాతనేరస్తులపై నిఘా ఉంచి అనుమానితులను విచారించి, బైండోవర్ చేయడం, కౌన్సెలింగ్ నిర్వహించటం జరిగిందన్నారు. 8.డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు తమ పరిధిలో గ్రామాలు, వార్డులను సందర్శించి ప్రజలతో ముఖాముఖి మాట్లాడి, దొంగతనాలు జరగకుండా తీసుకోవలసిన చర్యలు, సీసీ కెమెరాలు, మహిళా చట్టాలు, గంజాయి మరియు ఇతర మాదకద్రవ్యాల అనర్థాలు, చట్టపరమైన శిక్షలు గురించి అవగాహన కల్పించారన్నారు.
9.అలాగే సైబర్ నేరాలు, లోన్ యాప్స్, క్రికెట్ బెట్టింగ్, రహదారి భద్రత నియమాలు, హెల్మెట్ వినియోగం, కొత్త క్రిమినల్ చట్టాలపై విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నారన్నారు. చట్టాన్ని అతిక్రమించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవటం జరుగుతుందని ఎస్పీ స్పష్టం చేశారు.

# మైనారిటీ మహిళలకు రూ.50 వేల ఆర్థిక చేయూత

**- ఇందిరమ్మ మైనారిటీ మహిళ యోజన పథకం కింద శేరిలింగంపల్లి నియోజకవర్గ లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ**



రంగారెడ్డి జిల్లా బ్యూరో, సెప్టెంబర్ 02 (జర్నలిస్ట్ డైరీ) :
కొంగర కలాన్ లోని రంగారెడ్డి జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలో జరిగిన ఇందిరమ్మ మైనారిటీ మహిళ యోజన పథకం కింద అర్హులైన 278 మంది లబ్ధిదారులలో మైనారిటీ లకు 100% సబ్సిడీతో కోటి 39 లక్షల విలువ గల చెక్కులను మంత్రి అజారుద్దీన్, శాసన మండలి ప్రభుత్వ చీఫ్ విప్ డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి , దయానంద్ గుప్తా, ఎమ్మెల్యే లు ప్రకాష్ గౌడ్, వీర్లపల్లి శంకర్, అడిషనల్ కలెక్టర్ కిరణ్మయి, రాష్ట్ర మైనారిటీ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్, యాదవ కో ఆపరేటివ్ కార్పొరేషన్ చైర్మన్ రఘునాథ్ యాదవ్ తో కలిసి లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేసిన పియేసి చైర్మన్ ఆరెక పూడి గాంధీ.ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మహిళా సాధికారికత కోసం ఎంతగానో కృషి చేస్తున్నారు అని, మహిళలు ఆర్థికంగా స్వశక్తితో ఎదగనడానికి ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టడం జరిగినది అని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మహిళ పక్షపాతి అని, ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల లోపు ఉచిత కరెంట్, సన్న బియ్యం, ఇందిరమ్మ ఇండ్లు వంటి అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టడం జరిగినది అని, అదేవిదంగా మైనారిటీ మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసి, స్వయం ఉపాధి వైపు ప్రోత్సహించే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ మైనారిటీ మహిళ యోజన పథకం కింద అర్హులైన మహిళలకు రూ.50 వేల రూపాయల చొప్పున ఆర్థిక సహాయం అందించడం జరుగుతుంది అని గొప్ప కార్యక్రమం అని ఈ ఆర్థిక సహాయంతో మైనారిటీ మహిళలు చిన్నతరహా వ్యాపారాలు, స్వయం ఉపాధి కార్యక్రమాలు చేపట్టేందుకు అవకాశం ఏర్పడుతుందని , కుటుంబ ఆర్థిక పరిస్థితులను మెరుగుపరుచుకోవడంతో పాటు మహిళలు స్వతంత్రంగా ఆదాయం పొందేందుకు ఈ పథకం ఎంతగానో ఉపయోగపడుతుందని తెలియచేశారు. మైనారిటీ మహిళలకు ఆర్థికంగా అండగా నిలవడం ద్వారా వారి కుటుంబాల జీవన ప్రమాణాలను మెరుగుపరచడంతో పాటు స్వయం ఉపాధి అవకాశాలను పెంచాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని తెలియచేశారు .రూ.50 వేల ఆర్థిక సహాయం అందుకోవడంతో లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేశారు. తమకు ఆర్థికంగా అండగా నిలిచిన రాష్ట్ర ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి,మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుకు, ఎమ్మెల్యే ఆరెక పూడి గాంధీ కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియచేశారు తుర్క కాశ మైనారిటీలకు స్టోన్ కటింగ్ జనరేటర్ మరియు టూల్ కిట్స్ లను పంపిణీ చేయడం జరిగినది అని , తుర్క కషా మైనారిటీల సోదరులు వారి జీవనాధారమైన రాళ్ళు కటింగ్ చేయడానికి ఎక్కువ శ్రమ పడేవారు అని, రాబడి తక్కువ అని కానీ నేటితో జనరేటర్లు, టూల్ కిట్స్ ద్వారా సమయం ఆదా అవునని, శ్రమ తగ్గునని , రాబడి పెరుగునని, తక్కువ సమయంలో ఎక్కువ పని చేసుకొని ఆర్థికంగా బలోపేతం అవడానికి ఈ జనరేటర్లు, టూల్ కిట్లు ఎంతో ఉపయోగపడు నని తెలియచేశారు.

జర్నలిస్ట్ డైరీ
తెలుగు దినపత్రిక

# స్కాలర్‌షిప్‌ల పేరుతో జరిగే సైబర్ మోసాల పట్ల విద్యార్థులు, తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలి

**-వ్యక్తిగత బ్యాంకు వివరాలు, ఓటీపీలు ఎవరికీ వెల్లడించవద్దు**
**-బాపట్ల జిల్లా ఎస్పీ బి.ఉమామహేశ్వర్**

**బాపట్ల, జిల్లా బ్యూరో, జర్నలిస్ట్ డైరీ :** స్కాలర్ షిప్‌ల పేరుతో జరుగుతున్న సైబర్ మోసాల పట్ల విద్యార్థులు, తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ బి.ఉమామహేశ్వర్ ప్రజలకు, విద్యార్థులకు సూచించారు. స్కాలర్‌షిప్‌ల పేరుతో జరుగుతున్న సైబర్ మోసాలపై విద్యార్థులు, వారి తల్లిదండ్రులను అప్రమత్తం చేస్తూ బుధవారం జిల్లా ఎస్పీ ఓ ప్రకటన విడుదల చేశారు.

**జిల్లా ఎస్పీ మాట్లాడుతూ...**
ప్రస్తుతం సాంకేతికతను ఆసరాగా చేసుకుని సైబర్ నేరగాళ్లు నేరాలకు పాల్పడుతున్నారని అన్నారు. పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు ప్రస్తుత విద్యా సంవత్సరానికి సంబంధించిన స్కాలర్‌షిప్‌లకు దరఖాస్తు చేసుకునే సందర్భాన్ని ఆసరాగా చేసుకుని సైబర్ నేరగాళ్లు మోసాలకు పాల్పడుతున్నారని అన్నారు. విద్యార్థులకు లేదా వారి తల్లిదండ్రులకు ఫోన్ చేసి, తాము స్కాలర్‌షిప్ విభాగం, విద్యా సంస్థ లేదా ప్రభుత్వ శాఖ నుంచి మాట్లాడుతున్నట్లు పరిచయం చేసుకుని, స్కాలర్ షిప్ మంజూరైందని లేదా స్కాలర్ షిప్ మొత్తాన్ని ఖాతాలో జమ చేయడానికి కొన్ని వివరాలు అవసరమని చెబుతున్నారన్నారు. ఈ క్రమంలో విద్యార్థులు లేదా తల్లిదండ్రుల నుంచి ఆధార్, బ్యాంకు ఖాతా వివరాలు, ఏటీఎం/డెబిట్ కార్డు వివరాలు, పాస్‌వర్డ్‌లు, ఓటీపీ వంటి వ్యక్తిగత, ఆర్థిక సమాచారాన్ని సేకరించి మోసాలకు పాల్పడుతున్నారని ఎస్పీ హెచ్చరించారు. కొంతమంది సైబర్ నేరగాళ్లు స్కాలర్ షిప్ దరఖాస్తు లేదా ధ్రువీకరణ పేరుతో అనుమానాస్పద లింకులు పంపి, ఆ లింకులను క్లిక్ చేయడం ద్వారా నకిలీ వెబ్ సైట్‌లకు తీసుకెళ్లి వ్యక్తిగత వివరాలను నమోదు చేయించడం, హానికరమైన యాప్‌లను డౌన్‌లోడ్ చేయించడం లేదా బ్యాంకు సంబంధిత సమాచారాన్ని



తెలుసుకునే ప్రయత్నం చేయవచ్చన్నారు.

**అనుమానాస్పద లింకుల విషయంలో స్పందించవద్దు**
స్కాలర్‌షిప్ పొందేందుకు ముందుగా కొంత మొత్తాన్ని చెల్లించాలని, రిజిస్ట్రేషన్ లేదా ప్రాసెసింగ్ ఫీజు పేరుతో డబ్బులు పంపాలని కోరినా అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. స్కాలర్‌షిప్‌కు సంబంధించిన సమాచారం కోసం ఎవరైనా ఫోన్ చేసినప్పుడు వారి మాటలను మాత్రమే నమ్మకుండా, సంబంధిత విద్యాసంస్థ, అధికారిక ప్రభుత్వ వెబ్‌సైట్ లేదా సంబంధిత శాఖ ద్వారా సమాచారం నిజమో కాదో నిర్ధారించుకోవాలని ఎస్పీ సూచించారు. గుర్తు తెలియని నంబర్ల నుంచి వచ్చే కాల్స్, మెసేజ్‌లు, వాట్సాప్ సందేశాలు లేదా అనుమానాస్పద లింకుల విషయంలో తొందరపడి స్పందించవద్దన్నారు. బ్యాంకు ఖాతా వివరాలు, ఏటీఎం/డెబిట్ కార్డు వివరాలు, పిన్, పాస్‌వర్డ్, ఓటీపీ వంటి రహస్య సమాచారాన్ని ఫోన్ ద్వారా ఎవరైనా అడిగినా ఎట్టి పరిస్థితుల్లోనూ వెల్లడించవద్దని స్పష్టం చేశారు. విద్యార్థులు తమకు వచ్చే స్కాలర్‌షిప్ సమాచారం గురించి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో చర్చించి నిర్ధారించుకోవాలన్నారు. అధికారికంగా ధ్రువీకరించకుండా ఎటువంటి లింక్‌ను క్లిక్ చేయడం, అపరిచితులకు వ్యక్తిగత వివరాలు పంపడం లేదా వారి సూచనల మేరకు ఏదైనా యాప్‌ను ఇన్‌స్టాల్ చేయడం చేయవద్దని హెచ్చరించారు.

**సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ నంబర్ 1930కు కాల్ చేయండి**
ఒకవేళ పొరపాటున సైబర్ నేరగాళ్లకు బ్యాంకు వివరాలు, ఓటీపీ లేదా ఇతర రహస్య సమాచారాన్ని వెల్లడించినా, లేదా ఖాతా నుంచి నగదు మోసపూరితంగా బదిలీ అయినా భయపడకుండా వెంటనే సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ నంబర్ 1930కు కాల్ చేసి ఫిర్యాదు చేయాలని లేదా అనే సైబర్ క్రైమ్ పోర్టల్‌లో ఫిర్యాదు చేయాలని తెలిపారు. అనంతరం సంబంధిత బ్యాంకును సంప్రదించి ఖాతా/కార్డు సంబంధిత లావాదేవీలను నిలిపివేయడానికి అవసరమైన చర్యలు తీసుకుని, సమీపంలోని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలన్నారు. సైబర్ నేరాల విషయంలో ఆలస్యం చేస్తే మోసపోయిన నగదును నేరస్తుల ఖాతాల్లో ఫ్రీజ్ చేసే అవకాశం సన్నగిల్లుతుందని తెలిపారు. ఘటన జరిగిన వెంటనే 1930కు సమాచారం అందించడం అత్యంత ముఖ్యమని పేర్కొన్నారు.

**అప్రమత్తతే సైబర్ నేరాల నుంచి రక్షణ...**
విద్యార్థుల భవిష్యత్తును, తల్లిదండ్రుల కష్టార్జిత సొమ్మును లక్ష్యంగా చేసుకుని సైబర్ నేరగాళ్లు చేసే మోసాలకు ఎవరూ బలికాకుండా ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. స్కాలర్‌షిప్ పొందాలనే ఆశతో వ్యక్తిగత, బ్యాంకు వివరాలు, ఓటీపీలు అపరిచితులతో పంచుకోవద్దని అన్నారు. అప్రమత్తతే సైబర్ నేరాల నుంచి రక్షణ అని విద్యార్థులు, తల్లిదండ్రులకు జిల్లా ఎస్పీ గారు సూచించారు.

## జిల్లా ఎస్పీని కలిసిన విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ ఎస్పీ

**-నూతన బాధ్యతలు స్వీకరించిన విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ ఎస్పీ ఆర్.రమణ**




**ఒంగోలు, ప్రకాశం బ్యూరో, జర్నలిస్ట్ డైరీ :** నూతన బాధ్యతలు స్వీకరించిన విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ ఎస్పీ ఆర్.రమణ ప్రకాశం జిల్లా ఎస్పీ వి.హర్షవర్ధన్ రాజుని జిల్లా పోలీస్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు.

## వైఎస్సార్ సేవలు చిరస్మరణీయం..



**యంజాల్ ( సెప్టెంబర్ 02) జర్నలిస్ట్ డైరీ.** దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి వర్ధంతి సందర్భంగా బుధవారం యంజాల్‌లో ఆయనకు ఘనంగా నివాళులు అర్పించారు. సేవాదళ్ ప్రధాన కార్యదర్శి లిక్కి వెంకట్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో వైఎస్సార్ చిత్రపటానికి పలువురు నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ సీనియర్ నాయకులు కొత్తకుర్మ శివకుమార్, మంగమ్మ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైఎస్సార్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో పేదలు, రైతులు, మహిళలు, విద్యార్థులు, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి అనేక సంక్షేమ పథకాలను అమలు చేశారని గుర్తుచేశారు. ఆరోగ్యశ్రీ, ఉచిత విద్యుత్, ఫీజు రీయింబర్స్‌మెంట్, పావలా వడ్డీ తదితర పథకాల ద్వారా ప్రజల జీవితాల్లో వైఎస్సార్ చెరగని ముద్ర వేశారని అన్నారు. పేదల సంక్షేమం కోసం ఆయన చేసిన సేవలు ఎప్పటికీ ప్రజల హృదయాల్లో నిలిచిపోతాయని పేర్కొన్నారు. వైఎస్సార్ ఆశయాలను కొనసాగిస్తూ ప్రజా సేవలో ముందుకు సాగాలని నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్. గుడ్ల అర్జున్, భద్రయ్య, తదితరులు పాల్గొన్నారు.

## 'వన్‌స్టాప్' సెంటర్, బాలసదనం సిబ్బందికి నియామక ఉత్తర్వులు అందజేసిన జాయింట్ కలెక్టర్



**ఒంగోలు, ప్రకాశం బ్యూరో, జర్నలిస్ట్ డైరీ :** జాయింట్ కలెక్టర్ అధ్యక్షతన మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధీనంలో నడపబడుచున్న వన్ స్టాప్ సెంటర్ లోని సెంటర్ అడ్మిన్ మరియు కేసు వర్కర్లకు మరియు బాలసదనం, శిశు గృహ లోని రెండు హెల్పర్ పోస్టులకు సంబంధించి జాయింట్ కలెక్టర్ కల్పనా కుమారి అపాయింట్మెంట్ ఉత్తర్వులు అందజేశారు. క్రొత్తగా నియామకం పొందిన మహిళా అభ్యర్థులను జాయింట్ కలెక్టర్ స్వయంగా అభినందించి జాగ్రత్తగా ఉద్యోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారిణి పద్మ సునంద మరియు ఆఫీస్ సిబ్బంది పాల్గొన్నారు

## గోదావరి జలాలకు అడుగడుగునా నీరాజనాలు పలికిన ఉత్తరాంధ్ర ప్రజలు

**-పాయకరావుపేట వద్ద ఉత్తరాంధ్రకు గోదావరి జలాలను విడుదల చేసిన సీఎం చంద్రబాబు**
**-గోదావరి జలాలను ఉత్తరాంధ్రకు తెచ్చిన చంద్రబాబుకు రైతుల కృతజ్ఞతలు**

**పాయకరావుపేట,అనకాపల్లి, ఏపీ బ్యూరో, జర్నలిస్ట్ డైరీ :** ఉత్తరాంధ్ర ప్రజల దశాబ్దాల దాహార్తిని తీరుస్తూ, పోలవరం ఎడమ ప్రధాన కాలువ ద్వారా పయనించి వచ్చిన గోదావరి జలాలకు ముఖ్యమంత్రి చంద్రబాబు అపూర్వ రీతిలో స్వాగతం పలికారు. అనకాపల్లి జిల్లా పాయకరావుపేట వద్ద క్రాస్ రెగ్యులేటర్ నుంచి వస్తున్న గోదావరి జలాలకు, స్వయంగా కాలువలోనే నిల్చుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అరుణ వర్ణంలో ప్రవహిస్తున్న గోదారమ్మకు పుష్పాలు సమర్పించి, జలహారతి ఇచ్చి తన కృతజ్ఞతను చాటుకున్నారు. పవిత్ర గోదావరి జలాలను శిరస్సుపై చల్లుకున్న అనంతరం, ఉద్విగ్నభరిత వాతావరణంలో గోదావరి ప్రవాహానికి సాష్టాంగ నమస్కారం చేసి అందరినీ ఆశ్చర్యపరిచారు. బుధవారం పాయకరావుపేటలో జరిగిన ఈ చారిత్రక కార్యక్రమంలో భాగంగా, ముఖ్యమంత్రి చంద్రబాబు తొలుత శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. మంత్రులు





నిమ్మల రామానాయుడు, వంగలపూడి అనిత, కొల్లు రవీంద్ర, నారాయణ, అచ్చెన్నాయుడు, కొలుసు పార్థసారధి, ఎంపీలు చింతకాయల విజయ్, సీఎం రమేశ్, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి ఆయన గోదావరి జలాలను ఉత్తరాంధ్ర జిల్లాలకు విడుదల చేశారు. ఈ సందర్భంగా సాంప్రదాయ కోలాటంతో కళాకారులు ముఖ్యమంత్రికి ఘన స్వాగతం పలికారు.

**రూ.4,192 కోట్ల వ్యయంతో...**
రూ.4,192 కోట్ల వ్యయంతో నిర్మించిన పోలవరం ఎడమ కాలువ ద్వారా విడుదల చేసిన ఈ నీటితో నాలుగు జిల్లాల పరిధిలో 2.87 లక్షల ఎకరాలకు సాగునీరు, 9 లక్షల మందికి తాగునీరు అందించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. మొత్తం 23.44 టీఎంసీల గోదావరి జలాలతో విశాఖ, అనకాపల్లి జిల్లాల్లోని పారిశ్రామిక, తాగు, సాగునీటి అవసరాలు తీరనున్నాయి. ఈ నీటితో అనకాపల్లి వద్ద ఏలేరు కాలువతో పాటు జిల్లాలోని 110 చెరువులను నింపేందుకు జలవనరుల శాఖ ప్రణాళికలు సిద్ధం చేసింది. దీనివల్ల పుష్కర, ఏలేరు, పంపా, తాండవ, వరహా, మామిడిగెడ్డ ఆయకట్టు కింద ఉన్న మొత్తం 46,620 ఎకరాలు స్థిరీకరణ కానున్నాయి.

**ప్రజలు, రైతులు ఆనందోత్సాహాలతో పులకించి..**
గోదావరి జలాలు తమ ప్రాంతానికి రావడంతో స్థానిక ప్రజలు, రైతులు ఆనందోత్సాహాలతో పులకించిపోయారు. కాలువకు ఇరువైపులా నిల్చుని ప్రవాహానికి అడుగడుగునా పుష్పాంజలి ఘటిస్తూ, హారతులు పడుతూ గోదారమ్మకు స్వాగతం పలికారు. తమ ప్రాంతానికి గోదావరి జలాలను తీసుకువచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబుకు రైతు సోదరులు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. అనంతరం ముఖ్యమంత్రి అక్కడున్న ప్రజాప్రతినిధులు, అధికారులందరినీ స్వయంగా పిలిచి శిలాఫలకం వద్ద గ్రూప్ ఫోటోలు దిగారు

## కర్నూలు లో శాశ్వత హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేయాలి

**-గిద్దలూరు బార్ అసోసియేషన్ డిమాండ్**
**-డిమాండ్ కు మద్దతుగా రెండు రోజులు కోర్టు విధులను బహిష్కరిస్తున్న గిద్దలూరు న్యాయవాదులు**




**గిద్దలూరు,మార్కాపురం, జిల్లా బ్యూరో, జర్నలిస్ట్ డైరీ :** కర్నూలు లో శాశ్వత హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేయాలని గిద్దలూరు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం పట్టణంలోని పిఆర్ కాలనీలో గల కోర్ట్ కాంప్లెక్స్ బయట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యక్షులు పిఎన్. శేషశయనా రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే స్పందించి కర్నూలులో శాశ్వత హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేయాలనే డిమాండ్ కు మద్దతుగా బుధ, గురు వారాలలో గిద్దలూరులో న్యాయవాదులు కోర్టు విధులను బహిష్కరిస్తున్నట్లు ఆయన చెప్పారు. శాశ్వత బెంచ్ ఏర్పాటు చేయకుంటే తమ నిరసనను ఇంకా ఉధృతం చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు ఏ. తిరుమల ప్రసాద్, ప్రధాన కార్యదర్శి బి. ఐజాక్, ఉప కార్యదర్శి సిహెచ్ పోలయ్య, ట్రెజరర్ షేక్ ఫాజిల్, సీనియర్, జూనియర్ మరియు మహిళా న్యాయవాదులు పాల్గొన్నారు.

## లింగందాన గ్రామానికి ఇచ్చిన హామీని నెరవేర్చిన ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి

**-లింగందానలో రెండవ హైమాస్ట్ లైట్ ని ప్రారంభించిన ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి**
**-ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి సొంత నిధులతో రెండవ హైమాస్ట్ లైట్ ఏర్పాటు పట్ల హర్షం వ్యక్తం చేసిన గ్రామస్తులు**

**రంగారెడ్డి జిల్లా బ్యూరో, సెప్టెంబర్ 02 (జర్నలిస్ట్ డైరీ) :** కేశంపేట మండలం లింగందాన గ్రామంలో ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి తన సొంత నిధులతో ఏర్పాటు చేసిన రెండువ హైమాస్ట్ లైట్లను గ్రామస్తుల సమక్షంలో ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి ప్రారంభించారు. గత మూడు నెలల క్రితం లింగందన గ్రామంలో హైమాస్ట్ లైట్ ప్రారంభించిన సందర్భంలో ఎమ్మెల్సీ నవీన్ రెడ్డిని మరొక హైమాస్ట్ లైట్ ఏర్పాటు చేయాలని సర్పంచ్ నాగిల్ల వెంకట్ మరియు గ్రామస్తులు కోరగా రెండో లైట్ ని ఏర్పాటు చేయిస్తానని ఇచ్చిన హామీని నెరవేర్చడంతో గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో లింగందాన సర్పంచ్ నాగిల్ల



వెంకట్,కౌన్సిలర్ రఘునాథ్ యాదవ్,కేశంపేట సర్పంచ్ బుజ్జం సంతోష శ్రీశైలం యాదవ్, పోమాల్ పల్లి సర్పంచ్ స్వప్న భూపాల్ రెడ్డి,సుందరపూర్ సర్పంచ్ భారతి రవీందర్,తూర్పుగడ్డ తండ సర్పంచ్ థౌర్య నాయక్,తోమిదిరేకుల కంటెస్టెడ్ సర్పంచ్ రామ్ రెడ్డి,భైర్కాన్ పల్లి సర్పంచ్ తనయుడు శివ యాదవ్,మాజీ సర్పంచులు తాంద్ర విష్ణువర్ధన్ రెడ్డి,శేఖర్ పంతులు,యారం శేఖర్ రెడ్డి,ఆంజనేయులు యాదవ్,క్రిష్ణయ్య, సీనియర్ నాయకులు సుదర్శన్ గుప్త,ఉపసర్పంచులు లావణ్య తిరుపతి రెడ్డి,తండ్రా నరేందర్ రెడ్డి, రాజు నాయక్,నాయకులు బద్రు నాయక్, నాగరాజు, పల్లటి క్రిష్ణయ్య,జగన్ రెడ్డి, మల్లేష్,తుకారాం,మురళి,క్రిష్ణ, సాయిరాం, అబిశ్రీను, సినయ్య అబ్బీ రవి అనిల్ రాజు,యాదగిరి, శ్రీనివాస్, శశి, శేఖర్,లింగదాన వార్డు సభ్యులు,గ్రామస్థులు మరియు మండల బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్ట్ డైరీ
తెలుగు దినపత్రిక

## తెలంగాణ ప్రజలను కాంగ్రెస్ వంచించింది...ఎమ్మెల్యే మల్లారెడ్డి...



**నాగారం, సెప్టెంబర్ 2:-(జర్నలిస్ట్ డైరీ)**
అమలు కానీ హామీలు ఇచ్చి తెలంగాణ ప్రజలను కాంగ్రెస్ ప్రభుత్వం వంచించిందని మేడ్చల్ నియోజకవర్గం ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి అన్నారు. బుధవారం రోజు పిర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ,మేడ్చల్ నియోజకవర్గం నాగారం డివిజన్ రాంపల్లి చౌరస్తా లో కాంగ్రెస్ వెయ్యి రోజుల విఫల పాలనపై సెప్టెంబర్ 2 వ తేదీ నుండి 8 వ తేదీ వరకు జరిగే నీరసన కార్యక్రమలలో భాగంగా 420 ఫిట్ల ఫ్లెక్సీ ప్రదర్శన మరియు బాకీ కార్డు ల పంపిణి కార్యక్రమంలో మాజీ మంత్రి, మేడ్చల్ నియోజకవర్గం శాసనసభ్యులు మల్లారెడ్డి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

## పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలు....



**నాగారం, సెప్టెంబర్ 2:-(జర్నలిస్ట్ డైరీ)**
ప్రజా సమస్యలపై తనదైన పోరాటం చేస్తూ, దేశ ప్రయోజనాలను ముందు ఉంచే నాయకుడిగా ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారని నాగారం బిజెపి నాయకులు పి వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. బుధవారం పవన్ జన్మదినోత్సవం సందర్భంగా ఆయనకు వేంకటేశ్వరరావుతో పాటు పలువురు శుభాకాంక్షలు తెలిపారు. దేశాన్ని అభివృద్ధి పథంలో మరింత ముందుకు తీసుకెళ్లి, భారతదేశాన్ని సుభిక్షంగా, శక్తివంతంగా తీర్చిదిద్దగల సామర్థ్యం ఉన్న ఏకైక జాతీయ పార్టీగా భారతీయ జనతా పార్టీని విశ్వసించి, ఆ పార్టీతో ప్రయాణం చేయడం అందరికీ గర్వకారణం దేశ అభివృద్ధి, జాతీయ సమైక్యత, ప్రజా సంక్షేమం కోసం బిజెపి, జనసేన కలయిక మరింత బలపడాలని ఆకాంక్షిస్తూ... పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ గారికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. దేశం కోసం మీ ప్రయాణం విజయవంతం కావాలని, ప్రజల కోసం మీ పోరాటం మరింత బలపడాలని, భారతదేశం మరింత అభివృద్ధి చెందాలని కోరారు.

## నరసరావుపేట 'జేఎన్టీయూ'లో నూతన హాస్టళ్లను ప్రారంభించిన మంత్రి లోకేశ్

- -పల్నాడు జిల్లాలో పర్యటించిన మంత్రి నారా లోకేశ్
- -నరసరావుపేట జేఎన్టీయూకేలో నూతన హాస్టల్ భవనాల ప్రారంభం
- -రూ.70 కోట్ల వ్యయంతో 1,600 మంది విద్యార్థులకు వసతి సౌకర్యం
- -గౌతమి, కృష్ణవేణి, నాగార్జున పేర్లతో వసతి గృహాల నిర్మాణం




**నరసరావుపేట పల్నాడు, ఏపీ బ్యూరో, జర్నలిస్ట్ డైరీ :**
రాష్ట్ర విద్య, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ నేడు పల్నాడు జిల్లాలో పర్యటించారు. ఈ పర్యటనలో భాగంగా నరసరావుపేట మండలం కాకాని గ్రామ సమీపంలోని జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ ఇంజనీరింగ్ కళాశాలలో (జేఎన్టీయూ కాకినాడ పరిధి) నూతనంగా నిర్మించిన హాస్టల్ భవనాలను ఆయన ప్రారంభించారు. రూ.70 కోట్ల వ్యయంతో 1,600 మంది విద్యార్థినీ విద్యార్థుల కోసం ఆధునిక సౌకర్యాలతో ఈ వసతి గృహాలను నిర్మించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని మంత్రి లోకేశ్ ఆవిష్కరించారు. అనంతరం గౌతమి, కృష్ణవేణి, నాగార్జున పేర్లతో నిర్మించిన మూడు హాస్టల్ భవనాలను రిబ్బన్ కట్ చేసి లాంఛనంగా ప్రారంభించారు. ప్రారంభోత్సవం తర్వాత హాస్టల్ ప్రాంగణాన్ని, గదులను కలియతిరిగి విద్యార్థులకు కల్పించిన వసతులను పరిశీలించారు. అంతకుముందు కళాశాల ప్రాంగణానికి విచ్చేసిన మంత్రి లోకేశ్ కు యూనివర్సిటీ యాజమాన్యం, విద్యార్థులు, సిబ్బంది ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో మంత్రులు నారా లోకేశ్, గొట్టిపాటి రవికుమార్‌తో పాటు రాజ్యసభ ఎంపీ భాష్యం రామకృష్ణ, నర్సరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యేలు చదలవాడ అరవిందబాబు, జీవీ ఆంజనేయులు, జూలకంటి బ్రహ్మారెడ్డి, భాష్యం ప్రవీణ్ పాల్గొన్నారు. అలాగే, జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా, జాయింట్ కలెక్టర్ వి.సంజనా సిమ్హా, జేఎన్టీయూకే వైస్ ఛాన్సలర్ సీఎస్ఆర్కే ప్రసాద్, టీడీపీ జోనల్ కోఆర్డినేటర్ బీటీ నాయుడు, మాజీ ఎమ్మెల్సీ ఏఎస్ రామకృష్ణ తదితర ప్రముఖులు హాజరయ్యారు

# రిజిస్ట్రేషన్లలో అక్రమాలకు సహకారం..

- -మాజీ అధికారి అరెస్టు
- -నకిలీ పత్రాల రిజిస్ట్రేషన్లకు సహకారం
- -కీసర మాజీ సబ్‌రిజిస్ట్రార్ అరెస్టు...

**నాగారం, సెప్టెంబరు 2(జర్నలిస్ట్ డైరీ):**
నకిలీ స్థిరాస్తి పత్రాల రిజిస్ట్రేషన్లకు సహకరించడంతో పాటు పలు స్థిరాస్తి మోసం కేసుల్లో కీలకంగా వ్యవహరించిన కీసర మాజీ సబ్‌రిజిస్ట్రార్ మహ్మద్ యూసుఫ్ ఉర్ రహ్మాన్‌ను కీసర పోలీసులు అరెస్టు చేశారు. ఆయనపై కీసర పోలీస్‌స్టేషన్‌లో నమోదైన ఏడు కేసుల్లో నిందితుడిగా ఉన్నట్లు పోలీసులు తెలిపారు. సెప్టెంబరు 1న సాయంత్రం అదుపులోకి తీసుకుని విచారించిన అనంతరం అరెస్టు చేసి న్యాయస్థానంలో హాజరుపరిచి జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించారు. రూ.4.11 కోట్ల రుణాల మోసం క్రైం నంబరు 928/2025 దర్యాప్తులో నకిలీ, తారుమారు చేసిన స్థిరాస్తి పత్రాలను సృష్టించి ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న వ్యక్తుల పేర్లపై గృహ రుణాలు పొందిన వ్యవస్థీకృత మోసం వెలుగుచూసింది. ఇప్పటివరకు 11 గృహ రుణ లావాదేవీల ద్వారా సుమారు రూ.4.11 కోట్లు మోసపూరితంగా పొందినట్లు పోలీసులు గుర్తించారు. పత్రాలే ఆధారంగా రుణాలు




కీసర సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో నమోదైన పలు అనుమానాస్పద విక్రయ పత్రాలను నిందితులు అనంతరం బ్యాంకులు, గృహ రుణ సంస్థల్లో హామీ పత్రాలుగా ఉపయోగించినట్లు దర్యాప్తులో తేలింది. నకిలీ లింకు పత్రాలు, సాధారణ అధికార పత్రాలు, వ్యక్తుల గుర్తింపు తారుమారు తదితర మార్గాల్లో రిజిస్ట్రేషన్లు చేసినట్లు పోలీసులు తెలిపారు.
రుణం తీసుకుని ఎగవేత
మొదట కొంతకాలం వాయిదాలు చెల్లించి బ్యాంకులకు అనుమానం రాకుండా వ్యవహరించి, అనంతరం ఉద్దేశపూర్వకంగా వాయిదాలు నిలిపివేసినట్లు దర్యాప్తులో గుర్తించారు. బ్యాంకులు నోటీసులు జారీ చేసిన తర్వాత ఆస్తులను పరిశీలించగా కొన్ని ఆస్తులు ఉనికిలో లేకపోవడం, సర్వే నంబర్లు, ప్లాట్ నంబర్లు, లింకు పత్రాల్లో తారుమార్లు చేసినట్లు బయటపడింది.
కొనసాగుతున్న దర్యాప్తు
కీసర సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలోని అసలు రిజిస్ట్రేషన్ రికార్డులు, వేలిముద్రలు, జీవ గుర్తింపు వివరాలు, బ్యాంకు రుణ పత్రాలు, ఆర్థిక లావాదేవీలను పోలీసులు పరిశీలిస్తున్నారు. పరారీలో ఉన్న ఇతర నిందితులను గుర్తించి అరెస్టు చేయడంతో పాటు మోసపూరితంగా పొందిన నగదు, ఆస్తుల వివరాలను వెలికితీసేందుకు దర్యాప్తు కొనసాగుతోంది.



# మార్కులు మళ్లీ సాధించవచ్చు.. ప్రాణాలు కోల్పోవద్దు

- -షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ విద్యార్థిని అశ్విని మృతిపై ఎమ్మెల్యే దిగ్భ్రాంతి..
- -కమ్మదనం గురుకుల పాఠశాలను హుటాహుటిన సందర్శించిన ఎమ్మెల్యే
- -విద్యార్థులు, అధ్యాపకులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్న ఎమ్మెల్యే
- -ఆర్డీవో సరిత, సీఐ సీతారాం, ఎంఆర్ఓ నాగయ్య తదితర అధికారులతో సంఘటనపై ఆరా
- -సంఘటన స్థలాన్ని సందర్శించిన మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు



**రంగారెడ్డి జిల్లా బ్యూరో, సెప్టెంబర్ 02 (జర్నలిస్ట్ డైరీ) :**
మార్కులు పోతే మళ్లీ కష్టపడి చదివి సాధించవచ్చని, కానీ విలువైన ప్రాణాలు పోతే తిరిగి రావని షాద్‌నగర్ ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ అన్నారు. పరీక్షల్లో ఫెయిల్ అయ్యామని, మార్కులు తక్కువ వచ్చాయని లేదా మరేదైనా కారణంతో విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడవద్దని, విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం ఎంతో ముఖ్యమని ఆయన సూచించారు. రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ నియోజకవర్గం ఫరూక్‌నగర్ మండలం కమ్మదనం ప్రభుత్వ గురుకుల పాఠశాలలో బుధవారం ఇంటర్ సెకండియర్ విద్యార్థిని మూడవత్ అశ్విని తన వసతి గృహంలో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ హుటాహుటిన గురుకుల పాఠశాలను సందర్శించారు. అధికారులతో కలిసి గురుకులానికి చేరుకున్న ఆయన ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులు, హాస్టల్ సిబ్బందితో మాట్లాడి సంఘటనకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా ఆర్డీవో సరిత, పట్టణ సీఐ సీతారాం, ఎమ్మార్వో నాగయ్య, ఏవో జ్యోతి తదితర అధికారులతో మాట్లాడి సంఘటనకు దారితీసిన పరిస్థితులపై ఆరా తీశారు.
గురుకులంలో ఇంటర్ రెండో సంవత్సరం చదువుతున్న అశ్వినికి బుధవారం నెలవారీ పరీక్షలు నిర్వహిస్తున్న క్రమంలో కెమిస్ట్రీ సబ్జెక్టులో 23 మార్కులకు గాను మూడు మార్కులు వచ్చాయి. దీంతో ఆమె తీవ్ర నిరాశకు గురైనట్లు తెలుస్తోంది. మార్కుల జాబితా ఇచ్చిన క్రమంలో తన ఆన్సర్‌షీట్‌ను మార్చి మళ్లీ రాసి ఉపాధ్యాయురాలికి అందజేసింది. అయితే ఇప్పటికే మూడు మార్కులు వచ్చాయని, మళ్లీ ఆన్సర్‌షీట్ ఎందుకు రాస్తున్నావని ఉపాధ్యాయురాలు ఆమెకు సూచించినట్లు సమాచారం.
మూడు మార్కులు వచ్చాయన్న అవమానభారంతో అశ్విని తన వసతి గృహానికి వెళ్లి పడకగదిలోని సీలింగ్ ఫ్యాన్‌కు చున్నీతో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. కొన ఊపిరితో ఉన్న అశ్వినిని గుర్తించిన సిబ్బంది హుటాహుటిన ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యులు ఆమె ప్రాణాలు కోల్పోయినట్లు నిర్ధారించారు. అయినప్పటికీ ఎలాగైనా ప్రాణాలు దక్కించుకోవాలనే ఆశతో ఉపాధ్యాయులు ఆమెను మళ్లీ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ కూడా ఆమె మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించడంతో గురుకుల సిబ్బంది, విద్యార్థులు కన్నీరుమున్నీరుగా విలపించారు. ఈ సంఘటనపై ఆర్డీవో సరిత, సీఐ సీతారాం, ఎస్ఐ సైదులు, ఎమ్మార్వో నాగయ్య, ఏవో జ్యోతి తదితర అధికారులు గురుకుల పాఠశాలకు చేరుకొని జరిగిన సంఘటనపై ఆరా తీశారు. సంఘటనకు సంబంధించిన వివరాలను సేకరించారు. అదేవిధంగా మాజీ ఎమ్మెల్యే బక్కని నరసింహులు కూడా సంఘటనా స్థలానికి చేరుకొని వివరాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల్లో మానసిక ధైర్యాన్ని పెంపొందించేలా ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. మార్కులు తక్కువ వచ్చాయని అవమానభారంతో విద్యార్థిని ప్రాణాలు కోల్పోవడం బాధాకరమని మాజీ ఎమ్మెల్యే బక్కని నరసింహులు తెలిపారు.
అశ్విని మృతిపై ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మార్కులు తక్కువ వచ్చాయని అవమానభారంతో కృంగిపోయి అశ్విని ప్రాణాలు కోల్పోవడం ఎంతో బాధాకరమని అన్నారు. ఆడపిల్లలు ఎంతో ఆత్మస్థైర్యంతో ఈ సమాజంలో మెలగాలని ఆయన సూచించారు. అశ్వినికి కొంత అనారోగ్య సమస్యలతో పాటు మానసికంగా కృంగిపోయిన పరిస్థితులు ఉండటంతోనే ఆత్మహత్యకు పాల్పడి ఉండవచ్చని ఎమ్మెల్యే పేర్కొన్నారు. సంఘటనపై సమగ్ర విచారణ జరిపి ప్రభుత్వానికి నివేదిక అందజేయాలని స్థానిక అధికారులను ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆదేశించారు. ఇలాంటి సంఘటనలు భవిష్యత్తులో పునరావృతం కాకుండా తగిన చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. విద్యార్థుల్లో మానసిక ధైర్యాన్ని పెంపొందించడంతో పాటు, వారు ఎదుర్కొంటున్న సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకొని పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.
కాగా, ఈ సంఘటనపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నామని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించినట్లు సీఐ సీతారాం మీడియాకు వెల్లడించారు. విద్యార్థులు ఎలాంటి పరిస్థితుల్లోనైనా తొందరపాటు నిర్ణయాలు తీసుకోవద్దని, జీవితంలో ఎదురయ్యే అపజయాలను ధైర్యంగా ఎదుర్కోవాలని ఎమ్మెల్యే శంకర్ సూచించారు. మార్కులు తక్కువ రావడం జీవితానికి ముగింపు కాదని, మళ్లీ కష్టపడి చదివి మంచి మార్కులు సాధించవచ్చని, కానీ కోల్పోయిన ప్రాణాన్ని తిరిగి తీసుకురావడం సాధ్యం కాదని ఆయన అన్నారు.

# ఏపీ మంత్రి సత్యకుమార్ యాదవ్ కు బీజేపీ కీలక బాధ్యతలు

- -సేవా సంకల్ప్ అభియాన్' కార్యక్రమాలకు దక్షిణాది రాష్ట్రాల ఇన్‌ఛార్జిగా నియామకం
- -మోదీ 25 ఏళ్ల ప్రజా సేవను పూర్తి చేసుకున్న సందర్భంగా కార్యక్రమాలు
- -క్షేత్రస్థాయి పర్యవేక్షణ బాధ్యతలను చూడనున్న సత్యకుమార్



**అమరావతి, ఏపీ బ్యూరో, జర్నలిస్ట్ డైరీ :**
ఏపీ వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌కు బీజేపీ అధిష్ఠానం కీలకమైన ప్రాధాన్యాన్ని అప్పగించింది. ప్రధానమంత్రి మోదీ 25 ఏళ్ల సుదీర్ఘ ప్రజాసేవను పూర్తి చేసుకున్న సందర్భంగా దేశవ్యాప్తంగా నిర్వహించనున్న 'సేవా సంకల్ప్ అభియాన్' కార్యక్రమాలకు దక్షిణాది రాష్ట్రాల ఇన్‌ఛార్జిగా ఆయనను నియమించింది. సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 17 వరకు నెల రోజుల పాటు ఈ కార్యక్రమం కొనసాగనుంది. ఈ కార్యక్రమంలో భాగంగా బీజేపీ, ఎన్డీయే కూటమి ఆధ్వర్యంలో విస్తృత ప్రజా సంక్షేమ, సేవా కార్యక్రమాలను చేపట్టనున్నారు.

**వికసిత్ భారత్--2047' సంకల్పాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లడమే లక్ష్యంగా...**

ప్రజాసేవ, దేశాభివృద్ధి సహా 'వికసిత్ భారత్--2047' సంకల్పాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని రూపొందించారు. ఇందులో భాగంగా 'ఆశీర్వాద్ కా దియా', 'నమో సేవా గాథ', 'ఆంగన్ కా ఉత్సవ్', 'కహానీ బద్లావ్ కి', 'సేవా జ్యోతి యాత్ర' వంటి వినూత్న ప్రజా భాగస్వామ్య సేవలను ప్రజల ముందుకు తీసుకురానున్నారు. దక్షిణాదిలోని అన్ని రాష్ట్రాల్లో ఈ కార్యక్రమాల సమన్వయం, అమలు, క్షేత్రస్థాయి పర్యవేక్షణ బాధ్యతలను మంత్రి సత్యకుమార్ దగ్గరుండి చూడనున్నారు. ఈ పర్యటనలో భాగంగా తమిళనాడులోని తిరుచిరాపల్లిలో జరగనున్న రాష్ట్రవ్యాప్త వర్క్ షాప్ కు మంత్రి సత్యకుమార్ హాజరవుతున్నారు. దక్షిణాది రాష్ట్రాల్లో ఈ సేవా సంకల్ప్ అభియాన్‌ను విజయవంతం చేసేందుకు చేపట్టాల్సిన కార్యాచరణ, వ్యూహాలపై ఆయన అక్కడ పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేయనున్నారు

జర్నలిస్ట్ డైరీ
తెలుగు దినపత్రిక

# కమ్మదనం గురుకులంలో గిరిజన విద్యార్థిని ఆత్మహత్య..

-షాద్ నగర్ లో తీవ్ర కలకలం

-క్లాస్‌రూమ్‌లోనే ఫ్యాన్‌కు ఉరి..

-అశ్విని మృతిపై వీడని ప్రశ్నలు

-గురుకులంలో అసలేం జరిగింది?..

-ఆత్మహత్యకు కారణాలేంటి?

-మృతదేహాన్ని ప్రైవేటు హాస్పిటల్ నుండి ఉస్మానియాకు తరలించిన వైనం..



**రంగారెడ్డి జిల్లా బ్యూరో, సెప్టెంబర్ 02 (జర్నలిస్ట్ డైరీ) :** రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ పరిధిలోని కమ్మదనం ప్రభుత్వ గురుకుల పాఠశాలలో ఇంటర్మీడియట్ చదువుతున్న మూడవత్ అశ్విని అనే గిరిజన విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడి మృతి చెందిన ఘటన తీవ్ర కలకలం రేపింది. క్లాస్‌రూమ్‌లోనే ఫ్యాన్‌కు చున్నీతో ఉరివేసుకున్నట్లు పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించినట్లు సమాచారం. ఫ్యాన్‌కు ఉరివేసుకున్న అనంతరం అశ్విని అక్కడే మృతి చెందినట్లు తెలుస్తోంది.

ఘటనను గమనించిన పాఠశాల సిబ్బంది అశ్వినిని వెంటనే షాద్‌నగర్ పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించినట్లు సమాచారం. అయితే ఆసుపత్రికి తీసుకెళ్లే సమయానికే ఆమె మృతి చెందినట్లు తెలుస్తోంది. విషయం తెలుసుకున్న షాద్‌నగర్ ఎస్సై సైదులు హుటాహుటిన కమ్మదనం గురుకుల పాఠశాలకు చేరుకుని ప్రాథమిక విచారణ చేపట్టినట్లు సమాచారం. పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించినట్లు తెలుస్తోంది.అయితే గిరిజన విద్యార్థిని అశ్విని మృతిపై పలు ప్రశ్నలు, అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అశ్విని ఆత్మహత్యకు వ్యక్తిగత సమస్యలు కారణమా? లేక పాఠశాలలో ఎదురైన ఏదైనా సమస్య లేదా వేధింపులు కారణమా? అనే అంశాలపై చర్చ జరుగుతోంది. అయితే ఇప్పటివరకు ఈ విషయాలపై ఎలాంటి అధికారిక నిర్ధారణ లేదు. అశ్వినిని ఘటన స్థలం నుంచి ఆసుపత్రికి తరలించే సమయానికి ఆమె పరిస్థితి ఎలా ఉంది? ఘటన జరిగిన వెంటనే పోలీసులకు సమాచారం అందించారా? పోలీసుల రాకకు ముందే ఆమెను అక్కడి నుంచి తరలించారా? ఘటన స్థలంలో అసలు ఏం జరిగింది? అనే ప్రశ్నలకు సమాధానాలు రావాల్సి ఉంది. మరోవైపు అశ్విని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆసుపత్రికి హుటాహుటిన తరలించినట్లు సమాచారం. పోస్టుమార్టం నివేదికతో పాటు పోలీసుల దర్యాప్తులో వెలుగులోకి వచ్చే అంశాల ఆధారంగా విద్యార్థిని మృతికి సంబంధించిన పూర్తి వాస్తవాలు తెలిసే అవకాశం ఉంది. ఘటనపై పాఠశాల యాజమాన్యం నుంచి పూర్తి సమాచారం వెలువడకపోవడం కూడా చర్చనీయాంశంగా మారింది. ప్రిన్సిపల్ తదితరులను సంప్రదించేందుకు ప్రయత్నించినప్పటికీ వారు ఫోన్‌లో అందుబాటులోకి రాలేదని సమాచారం. విద్యార్థిని కుటుంబ సభ్యులకు ఘటన గురించి ఎప్పుడు సమాచారం అందించారు? మృతదేహాన్ని ఆసుపత్రికి తరలించే ప్రక్రియ ఎలా జరిగింది? అనే అంశాలపై కూడా స్పష్టత రావాల్సి ఉంది. కమ్మదనం గురుకుల పాఠశాలలో చదువుతున్న గిరిజన విద్యార్థిని అశ్విని ఆకస్మికంగా ఆత్మహత్యకు పాల్పడి మృతి చెందడం విద్యార్థులు, తల్లిదండ్రులు, స్థానికుల్లో తీవ్ర ఆందోళనకు కారణమైంది. అశ్విని ఆత్మహత్యకు దారితీసిన పరిస్థితులు ఏమిటి? ఘటనకు ముందు ఏం జరిగింది? అనే అంశాలపై పోలీసులు అన్ని కోణాల్లో సమగ్రంగా దర్యాప్తు చేసి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాల్సిన అవసరం ఉంది. గిరిజన విద్యార్థిని అశ్విని మృతికి దారితీసిన అసలు కారణాలేమిటో పోలీసుల దర్యాప్తు, పోస్టుమార్టం నివేదిక అనంతరం తేలాల్సి ఉంది.

# గొల్లగుప్పలో 'మలేరియా' 'మాత్రలు' వికటించి 'చిన్నారి' బాలిక 'మృతి'







-మరో 53 మందికి అస్వస్థత

-అప్రమత్తమైన ప్రభుత్వం

-మలేరియా నివారణకు పంపిణీ చేసిన క్లోరోక్విన్ ట్యాబ్లెట్లు వికటించి అస్వస్థత

-ప్రత్యేక మెడికల్ క్యాంప్ ఏర్పాటు చేసి నిరంతరం వైద్య పరీక్షలు

-ప్రజలు ఎవరూ ఆందోళన చెందవద్దు

-పోలవరం జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్





**ఏటపాక, ఏపీ బ్యూరో, జర్నలిస్ట్ డైరీ :** పోలవరం జిల్లా ఏటపాక మండలం గొల్లగుప్ప గ్రామంలో మలేరియా నివారణకు పంపిణీ చేసిన క్లోరోక్విన్ ట్యాబ్లెట్లు వేసుకోవడంతో 54 మంది అస్వస్థతకు లోనయ్యారు.

వీరిలో ఒక బాలిక మృతి చెందగా, మిగతా వారి పరిస్థితి నిలకడగా ఉంది. ఈ ఘటనపై ప్రభుత్వం అప్రమత్తమై వెంటనే చర్యలు చేపట్టినట్లు జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్ తెలిపారు. బాధితులకు సకాలంలో మెరుగైన వైద్యం అందించడంతో పాటు, ప్రత్యేక మెడికల్ క్యాంప్ ఏర్పాటు చేసి నిరంతరం వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజలు ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఆయన స్పష్టం చేశారు.గొల్లగుప్ప గ్రామంలో మొత్తం 253 మంది నివసిస్తున్నారు. వీరిలో అస్వస్థతకు గురైన వారిని గుర్తించి అవసరమైన వైద్య సేవలు అందిస్తున్నారు. బాధితుల ఆరోగ్య పరిస్థితిని వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, అవసరమైతే ఆసుపత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారని కలెక్టర్ పేర్కొన్నారు.

**గొల్లగుప్ప ఘటనపై సీఎం చంద్రబాబు సమీక్ష**

పోలవరం జిల్లా గొల్లగుప్ప ఘటనపై సిఎం చంద్రబాబు సమీక్షించారు. క్లోరోక్విన్ ట్యాబ్లెట్లు వికటించి ఒక బాలిక చనిపోయిందనే సమాచారంపై వైద్య ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులు, జిల్లా కలెక్టర్తో ఆయన మాట్లాడి పరిస్థితిని తెలుసుకున్నారు. గొల్లగుప్పలో మొత్తం 71 మందికి మందులు పంపిణీ చేసినట్లు అధికారులు తెలిపారు. 47 మంది చిన్నారులు, ఏడుగురు పెద్దవారు అస్వస్థతకు గురయ్యారని, ప్రత్యేక మెడికల్ క్యాంప్ ఏర్పాటు చేసి చికిత్స అందిస్తున్నట్లు సీఎంకు వివరించారు.

**30 మందిని భద్రాచలం ఏరియా ఆసుపత్రికి తరలింపు**

అస్వస్థతకు గురైన వారిలో 30 మందిని భద్రాచలం ఏరియా ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. వీరిలో చిన్నారులు, పెద్దవారు కూడా ఉన్నారు. అయితే పరిస్థితి విషమించడంతో 7 ఏళ్ల మడివి జమున మృతి చెందింది. ఈ చిన్నారి జీపీఎస్ పాఠశాలలో రెండో తరగతి చదువుతోంది. చికిత్స పొందుతున్న మిగిలిన బాధితుల ఆరోగ్య పరిస్థితిని డాక్టర్లు నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. ఆసుపత్రి వైద్యులతో జిల్లా అధికారులు సమన్వయం చేసుకుంటూ, మెరుగైన వైద్య సేవలు అందేలా చర్యలు చేపట్టారు.

**లక్ష్మీపురం పీహెచ్సీలో 24 మందికి వైద్య సేవలు**

అస్వస్థకు గురైన వారిలో 24 మందికి లక్ష్మీపురం పీహెచ్సీలో వైద్య సేవలు అందిస్తున్నారు. వారి ఆరోగ్య పరిస్థితిని వైద్య సిబ్బంది నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. పీహెచ్సీలో ప్రాథమిక స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించి, అవసరాన్ని బట్టి వైద్య సేవలు అందిస్తున్నారు. పరిస్థితి పూర్తిగా అదుపులో ఉన్నట్లు అధికారులు తెలిపారు.

**గొల్లగుప్ప గ్రామంలో ప్రత్యేకంగా మెడికల్ క్యాంప్**

బాధితులకు తక్షణ వైద్య సేవలు అందించేందుకు అధికారులు గొల్లగుప్పలో ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. రాష్ట్రస్థాయి నుంచి ఒక మెడికల్ టీం, కాకినాడ నుంచి నిపుణుల వైద్య బృందం, రాజమహేంద్రవరం నుంచి మరో మెడికల్ టీం ఇక్కడికి చేరుకుని వైద్య పరీక్షలు నిర్వహిస్తోంది. వీరితో పాటు ముగ్గురు పెడియాట్రిషియన్లు కూడా అందుబాటులో ఉన్నారని అధికారులు తెలిపారు.

**వైద్య శాఖ అప్రమత్తం**

రాష్ట్రస్థాయి అధికారుల ఆదేశాల మేరకు వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. గొల్లగుప్ప గ్రామంలో వైద్య సేవలను విస్తృతం చేయడంతో పాటు, బాధితుల ఆరోగ్య పరిస్థితిపై ఎప్పటికప్పుడు వివరాలు సేకరిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ ఘటనపై ఎప్పటికప్పుడూ పర్యవేక్షణ చేస్తోందని కలెక్టర్ తెలిపారు.

**ఆసుపత్రులు, గ్రామాన్ని సందర్శించిన ఐటీడీఏ పీవో**

జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్ ఆదేశాల మేరకు ఐటీడీఏ పీవో శుభం నోఖ్వాల్, ఏఎస్పీ హేమంత్ బండిరేవు వద్ద గ్రామస్తులతో మాట్లాడి పరిస్థితిని తెలుసుకున్నారు. అస్వస్థతకు గురైన వారిని సకాలంలో ఆసుపత్రులకు తరలించేలా చర్యలు చేపట్టారు. ఐటీడీఏ పీవో శుభం నోఖ్వాల్ మంగళవారం రాత్రి భద్రాచలం ఏరియా ఆసుపత్రిని, అనంతరం లక్ష్మీపురం పీహెచ్సీకి వెళ్లి బాధితుల ఆరోగ్య పరిస్థితిని స్వయంగా పరిశీలించారు.

## పేదల పక్షాన పెట్టిన ఘనత వైయస్ రాజశేఖర్రెడ్డి దక్కుతుంది, మామిడి రాంచందర్..

**- వైయస్ఆర్ వర్ధంతి సందర్బంగా ఆనాధవి ద్యార్థులకు పండ్ల పంపిణీ...**





**జర్నలిస్ట్ డైరీ: ఎల్బీనగర్,** వైయస్ఆర్ వర్ధంతి సందర్భంగా బీఆర్ఎస్ సీనియర్ నాయకులు. వైయస్ఆర్ అభిమాన నాయకుడు మామిడి రాండందర్ ఆధ్వర్యంలో బుదవారం ఆర్కేపురం డివిజన్ చిత్ర లేఅవుట్ లోని అనాధ విద్యార్థి గృహం లోని పిల్లలకు పండ్లు వంచడం జరిగింది. ఈ సందర్భంగా రాంచందర్ మాట్లాడుతూ 2004లో వైఎస్ రాజశేఖర్ రెడ్డి ప్రమాణ స్వీకారం మొదటి సంతకం ఉచిత విద్యుత్తు రైతుల రుణమాఫీ చేయడం అలాగే ఫీజు రీయంబర్‌ంట్ ఆరోగ్యశ్రీ 108 లాంటి ఎన్నో అభివృద్ధి. సంక్షేమ పథకాలు ప్రవేశ పెట్టిన ఘనత వైయస్ రాజశేఖర్ రెడ్డి దక్కుతుందని అన్నారు. పేదల పక్షాన వారు రేసిన సేవలు ఇప్పటి కూడా ప్రజల గుండెల్లో నిలిచినవి అంటే వైఎస్ రాజశేఖర్ రెడ్డి చేసిన సంక్షేమ అభివృద్ధి పథకాలను గుర్తు చేసుకుంటూ వారి ఆశయాలను కొనసాగించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం నాయకులు రవి. మాసూమ్. వివేక్ రెడ్డి, సంజయ్. రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

**వైయస్ఆర్సీపీ సోషల్ మీడియా ఇంచార్జ్ ఆధ్వర్యంలో..**

వైయస్ఆర్ సీపీ సోషల్ మీడియా ఇన్చార్ట్ ఇరుగు విఖ్యాత్ టోని, నాయకులు ఇరుగు రరణ్. వెంకీ బండారు మోహన్, బాను. లోకేష్ అవ్వర్యంలో బుధవారం దివంగత నేత వైయస్ రాజశేఖరెడ్డి 17 వ వర్ధంతి సందర్భంగా ఎల్బీనగర్లోని చిత్రలేవుట్ కాలనీలో డాక్టర్ వైయస్ రాజశేఖరెడ్డి విగ్రహాన్ని పూల మాలలు వేసి నివాళులు అర్పించారు..

రైటప్ –చిత్రలేవుట్ కాలనీలోని అనాధ విద్యార్థి గృహంలో విద్యార్థులకు పండ్లు పంపిణీ చేస్తున్న మామిడి రాంచందర్...

రైటప్ , వైయస్ఆర్సీపీ సోషల్ మీడియా ఇంచార్జ్ ఇరుగు విఖ్యాత్ లోని అధ్వర్యంలో వైస్ఆర్ విగ్రహాన్ని పూల మాలలు వేసి నివాళులు అర్పిస్తున్న నాయకులు

## పద్మ శ్రీ కృష్ణ మాదిగ ను కలిసి ఎల్బీనగర్ నియోజక వర్గం నాయకులు..

**– రాష్ట్రంలో ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటం కొనసాగించాలి: మంద కృష్ణ మాదిగ**



**జర్నలిస్ట్ డైరీ ఎల్బీనగర్:** ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు.పద్మ శ్రీ మంద కృష్ణ మాదిగను ఎల్బీనగర్ ఆయన నియోజకవర్గం నూతనంగా ఏనుకున్న ఎమ్మార్పీఎస్ డివిజన్ నాయకులు బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతన కమిటి సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేసి అభినందించారు. అనంతరం మాట్లాడుతూ అసమానతలు లేని. సమాజాన్ని నిర్మించాలని సూచించారు. సమాజం లో సమానత్వం కోసం ఉద్యమించాలి పిలుపునిచ్చారు. ఎమ్మార్పీఎస్ రాష్ట్రంలో ప్రజా సమ్యలపై నిరంతరం పోరాటం కొనసాగిస్తుందని తెలిపారు. ఎమ్మార్పీఎస్ డివిజన్. బస్తీలలో మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రంగారెడ్డి జిల్లా సీనియర్ నాయకులు బత్తిన సుదాకర్ మాదిగ, చంపాపేట్ డివిజన్ అధ్యక్షులు వీసన్న మాదిగ, ఉపాధ్యక్షులు మహేష్ మాదిగ, మన్సు రాబాద్ డివిజన్ అధ్యక్షులు కాశీ మాదిగ ఎంఎస్పీ అధ్యక్షులు నర్రా శ్రీనివాస్ మాదిగ, ఉపాధ్యక్షులు గండికోట భీంరాజ్ నాయకులు ప్రకాష్ మాదిగ, రాజు మాదిగ, సురేష్ మాదిగ, నరసింహ మాదిగ నర్సింగ్ రావు మౌలాలి మాదిగ, రాజు మాదిగ, చిచ్చా మాదిగ, క్రాంతికుమార్. దేవా మాదిగ రాము. ప్రకాష్ మాదిగ, బోడగుట్ట రాజు మాదిగ, రాజుకర్. మదు. సునీల్ రంగన్న మాదిగ తదితరులు పాల్గొన్నారు. రైటఫ్:- మంద కృష్ణ మాదిగను కలిసిన ఎల్బీనగర్ నియోజకవర్గం ఎమ్మార్పీఎస్ నాయకులు

## వైఎస్సార్ వర్ధంతి సందర్భంగా ఘన నివాళులు...



**నాగారం, సెప్టెంబర్ 2:-(జర్నలిస్ట్ డైరీ)** నాగారం డివిజన్ పరిధిలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్ద దివంగత ముఖ్యమంత్రి, మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి వర్ధంతి సందర్భంగా బుధవారం నాగారం డివిజన్‌కు చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు వైఎస్సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం ఓల్డ్ ఏజ్ హోమ్‌లోని వృద్ధులకు పండ్లు పంపిణీ చేసి, వారి ఆశీర్వాదాలు తీసుకున్నారు.పేదలు, రైతులు, మహిళలు, విద్యార్థులు మరియు అన్ని వర్గాల ప్రజల సంక్షేమం కోసం డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి చేసిన సేవలను ఈ సందర్భంగా నాయకులు, కార్యకర్తలు స్మరించుకున్నారు.

# గొల్లగుప్ప ఘటనపై సీఎం చంద్రబాబు సీరియస్..
# సమగ్ర విచారణకు ఆదేశం

**-గొల్లగుప్పలో మలేషియా నివారణ క్లోరోక్విన్ మాత్రలు వేసుకుని బాలిక మృతి, -పలువురికి అస్వస్థత**

**ఘటనపై సీఎం చంద్రబాబు ఉన్నతస్థాయి విచారణకు ఆదేశం**

**-బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని అధికారులకు స్పష్టమైన సూచనలు**

**-భద్రాచలం, లక్ష్మీపురం ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న బాధితులు**

**-ప్రస్తుతం బాధితుల ఆరోగ్యం నిలకడగా ఉందని వెల్లడించిన అధికారులు**



**అమరావతి, ఏపీ బ్యూరో, జర్నలిస్ట్ డైరీ :** పోలవరం జిల్లా, ఏటపాక మండలం గొల్లగుప్ప గ్రామంలో క్లోరోక్విన్ మాత్రలు వేసుకున్న అనంతరం ఏడేళ్ల బాలిక మృతి చెందడం, పలువురు అస్వస్థతకు గురికావడంపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తీవ్రంగా స్పందించారు. ఈ ఘటనపై తక్షణమే సమగ్ర విచారణ జరపాలని అధికారులను ఆదేశించారు. బాధితులందరికీ అత్యుత్తమ వైద్య సేవలు అందించాలని ఆయన స్పష్టం చేశారు. ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులు, జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్‌తో ముఖ్యమంత్రి ఈ ఘటనపై సమీక్ష నిర్వహించారు. మలేరియా రాకుండా ముందస్తు చర్యల్లో భాగంగా గ్రామంలోని 71 మందికి క్లోరోక్విన్ మాత్రలు పంపిణీ చేయగా, వాటిని తీసుకున్న తర్వాత పలువురు అనారోగ్యం పాలయ్యారు. ఈ దురదృష్టకర ఘటనలో జమున అనే ఏడేళ్ల చిన్నారి ప్రాణాలు కోల్పోయింది.

**ప్రభుత్వ ఆదేశాలతో అధికార యంత్రాంగం తక్షణమే సహాయక చర్యలు**

ప్రభుత్వ ఆదేశాలతో అధికార యంత్రాంగం తక్షణమే సహాయక చర్యలు చేపట్టింది. అస్వస్థతకు గురైన వారిలో 29 మందిని భద్రాచలం ఏరియా ఆసుపత్రికి, మరో 24 మందిని లక్ష్మీపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించి చికిత్స అందిస్తున్నారు. గ్రామంలో అత్యవసర వైద్య శిబిరాలను ఏర్పాటు చేశారు. కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రి నుంచి తొమ్మిది మంది సభ్యులతో కూడిన ప్రత్యేక వైద్య బృందం ఇప్పటికే గ్రామానికి చేరుకోగా, విజయవాడ, రాజమండ్రి నుంచి మరిన్ని బృందాలు బయలుదేరాయి.

ఈ ఘటనలో ఇద్దరు చిన్నారులు మరణించారంటూ వస్తున్న వార్తల్లో నిజం లేదని, కేవలం ఒక బాలిక మాత్రమే మృతి చెందిందని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. ప్రస్తుతం ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న వారి ఆరోగ్యం నిలకడగా ఉందని, జిల్లా యంత్రాంగం పరిస్థితిని నిశితంగా పర్యవేక్షిస్తోందని వారు వెల్లడించారు

## ఎమ్మార్పీఎస్ నూతన కమిటీ నియామక పత్రాల అందచేత



పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు ఎమ్మార్పీఎస్ నూతన కమిటీల నిర్మాణ పక్రియలో భాగంగా మున్సిపాలిటీ కాలనీలో కోళ్లరు శ్రీహరి ఆధ్వర్యంలో బుధవారం కమిటీ సమావేశాన్ని నిర్వహించడం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిధిగా ఎల్బీనగర్ ఎమ్మార్పీఎస్ నియోజకవర్గం ఇంచార్జి కొమ్ము రాజశేఖర్ మాదిగ హాజరై ఉద్యమ అవశ్యకత, ప్రస్తుత పరిణామాలు, నాయకుల కర్తవ్యాలు, భవిష్యత్ లక్ష్యాలు వివరించి ఎమ్మార్పీఎస్ కమిటీ ప్రకటించడం జరిగింది. అనంతరం మంద కృష్ణ మాదిగ సందేశాన్ని వివరిస్తూ నూతన కమిటీని ఎన్నుకొని నియామక పత్రాలు అందజేశారు. నూతన కమిటీ లో భాగంగా చైతన్యపురి డివిజన్ అధ్యక్షులుగా చిత్రం పురుషోత్తం, ప్రధాన కార్యదర్శి గా కళ్యాణ్ బాబు,ఉపాధ్యక్షలుగా కృష్ణ తేజా, కోశాధికారిగా కొల్లూరి వినోద్,ప్రధాన కార్యదర్శిగా బంటీ, ఉపాధ్యక్షులుగా కిట్టు,శివ
కార్యదర్శులుగా అభిషేక్, శశి, వినోద్,
సహాయ కార్యదర్శిలుగా కార్తీక్ బాబు, అవినాష్ ఎన్నికైనారు.

## అసమానతలు లేని సమాసజాన్ని నిర్మిచాలి
### - మంద కృష్ణ మాదిగ



అసమానతలు లేని సమాసజాన్ని నిర్మిచాలని పద్మ శ్రీ మంద కృష్ణ మాదిగ అన్నారు. ఎల్బీనగర్ నియోజకవర్గంలో నూతనంగా ఎన్నికైన నాయకులు బుధవారం నాడు పద్మ శ్రీ మంద కృష్ణ మాదిగని మర్యాద పూర్వకంగా కలసి ఆశీస్సులు తీసుకున్నారు. ఈ సందర్భంగా మంద కృష్ణ మాదిగ మాట్లాడుతూ సమాజం లో సమానత్వం కోసం ప్రతి ఒక్కరూ ఉద్యమించాలని కోరారు. అనంతరం నూతన కమిటీ సభ్యులను దీవించారు. ఈకార్యక్రమంలో చంపాపేట్ అధ్యక్షులు బీసన్న మాదిగ, ఉపాధ్యక్షులు మహేష్ మాదిగ, మన్సు రాబాద్ డివిజన్ అధ్యక్షులు కాశీ మాదిగ, ఎం ఎస్ పి అధ్యక్షులు నర్రా శ్రీనివాస్ మాదిగ, ఉపాధ్యక్షులు గండికోట భీంరాజ్,సీనియర్ నాయకులు బత్తిన సుధాకర్ మాదిగ ప్రకాష్ మాదిగ, రాజు మాదిగ, సురేష్ మాదిగ, నరసింహ మాదిగ, నర్సింగ్ రావు మాదిగ, మౌలాలి మాదిగ, రాజు మాదిగ, చిచ్చా మాదిగ,క్రాంతికుమార్ దేవా మాదిగ, రాము, ప్రకాష్ మాదిగ, బోడగుట్ట రాజు, మాదిగ రాజుకర్, మధు, సునీల్ మాదిగ, రంగన్న మాదిగ,
తదితరులు పాల్గొన్నారు.

## బీఎన్ రెడ్డి డివిజన్ లో ఎమ్మార్పీఎస్ నూతన కమిటీ ఏర్పాటు.



పద్మశ్రీ మందకృష్ణ ఆదేశాల మేరకు ఎమ్మార్పీఎస్ ఎల్బీనగర్ నియోజకవర్గం ఇంచార్జి కొమ్ము రాజశేఖర్ మాదిగ ఆధ్వర్యంలో బుధవారం ఎల్బీనగర్ నియోజకవర్గం బీఎన్ రెడ్డి డివిజన్
ఎమ్మార్పీఎస్ నూతన కమిటీని ఏర్పాటు చేసి అనంతరం నియామక పత్రాలు అందజేశారు. నూతనంగా ఎన్నికైన వారిలో
అధ్యక్షులుగా కొమ్ము లింగన్న,
ఉపాధ్యక్షులుగా ఇరుగు లింగరాజు,
ప్రధాన కార్యదర్శిగా ఇరుగు మల్లయ్య,
ప్రధాన కార్యదర్శిగా ఇరుగు వెంకటేష్,
అధికార ప్రతినిధిగా వాడాకోలా శ్రీకాంత్,
కార్యదర్శులుగా తలారి సతీష్,
సహాయ కార్యదర్శులుగా కొమ్ము మల్లేష్, ఇరుగు వేణు ఉన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్, ఎం ఎస్ పి కార్యకర్తలు పాల్గొన్నారు.

# మృతి చెందిన జన సైనికుడు
# ప్రేమ్ కుమార్ కుటుంబానికి అండగా ఉంటాం

**-ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ భరోసా**
**-ప్రేమ్ కుమార్ మృతి నన్ను కలచి వేసిందన్న పవన్ కళ్యాణ్**
**-ఫ్లెక్సీ కడుతూ విద్యుదాఘాతానికి గురై మృతి చెందిన జన సైనికుడు ప్రేమ్ కుమార్**
**-పార్టీ తరపున రూ.5 లక్షల సాయం....**





**అల్లవరం,అమరావతి, ఏపీ బ్యూరో, జర్నలిస్ట్ డైరీ :** డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అల్లవరం మండలం బెండమూర్లంకకు చెందిన జన సైనికుడు రోళ్ల ప్రేమ్ కుమార్ విద్యుత్ ఘాతానికి గురై మృతి చెందడం కలచి వేసిందని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. అతని ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తున్నట్లు ఒక ప్రకటనలో తెలిపారు. ఆ కుటుంబానికి అండగా నిలుస్తామని భరోసా ఇచ్చారు. జీవితం ఎంతో అమూల్యమైనదని, ర్యాలీలు, బ్యానర్ల ఏర్పాటులో స్వీయ భద్రతకు పాధాన్యం ఇస్తూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

**పార్టీ తరపున రూ.5 లక్షల సాయం....**

ప్రేమ్ కుమార్ కుటుంబానికి అన్ని విధాలా అండగా నిలుస్తామని రాష్ట్ర పౌరసరఫరాల శాఖా మంత్రి నాదెండ్ల మనోహర్ హామీ ఇచ్చారు. బుధవారం ఆయన జనసేన ఎమ్మెల్యేలతో కలిసి మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించారు. వారికి పార్టీ తరపున రూ.5 లక్షల సాయం అందించారు. మృతుడి తండ్రి సతీష్ తో మాట్లాడారు. ఇంజినీరింగ్ చదువుతూ ఇటీవలే ఉద్యోగానికి ఎంపికైన కుమారుడు మృతి చెందడంపై బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. మంత్రి మాట్లాడుతూ మృతుడి సోదరుడు ఆదినారాయణకు ఉద్యోగం కల్పిస్తామని భరోసా ఇచ్చారు. ఎమ్మెల్యేలు గిడ్డి సత్యనారాయణ, దేవ వరప్రసాద్, డీసీసీబీ ఛైర్మన్ తుమ్మల బాబు తదితరులు పాల్గొన్నారు.

# టిఆర్పి షాద్నగర్ నియోజకవర్గ అధ్యక్షులుగా ఎమ్మె సంతోష్ కుమార్ నియామకం

**రంగారెడ్డి జిల్లా బ్యూరో, సెప్టెంబర్ 02 (జర్నలిస్ట్ డైరీ) :** తెలంగాణ రాజ్యాధికార పార్టీ (TRP) షాద్నగర్ నియోజకవర్గ అధ్యక్షులుగా ఎమ్మె సంతోష్ కుమార్ ని నియమించినట్లు సంతోష్ కుమార్ తెలిపారు. బుధవారం హైదరాబాద్ తెలంగాణ రాజ్యాధికార పార్టీ రాష్ట్ర కార్యాలయంలో అధ్యక్షులు తీన్మార్ మల్లన్న ఎమ్మె సంతోష్ కి నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మె సంతోష్ మాట్లాడుతూ...
తీన్మార్ మల్లన్న బడుగు బలహీన వర్గాల కోసం అహర్నిశలు పోరాటాన్ని మెచ్చి పార్టీలో చేరడం జరిగింది రాష్ట్ర అధ్యక్షులు ఆదేశా అనుసారం బడుగు బలహీన వర్గాలకు రాజ్యాధికారం వచ్చేవరకు పోరాటం సాగిస్తామని జనాభా ప్రాతిపదికంగా రాజ్యాధికారం ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు బండారి రమేష్ యాదవ్, రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ అధ్యక్షులు నరసయ్య గౌడ్, జిల్లా ఉపాధ్యక్షులు జనార్ధన్, రాష్ట్ర నాయకురాలు వాసుకి, రంగారెడ్డి జిల్లా మహిళా అధ్యక్షురాలు విజయలక్ష్మి కొందుర్గు మండల అధ్యక్షులు దర్గా వెంకటయ్య, చౌదర్ గూడెం మండల అధ్యక్షులు రాములు, తాలూకా ఉపాధ్యక్షులు రాధాకృష్ణ, గుండ్ల నవీన్, కాశ యాదయ్య, రామచంద్రయ్య మరియు నాయకులు పాల్గొన్నారు



Printed, Published and Owned by SITARALLA SRIRAMULU and Printed at M/s SRI DIVYA PRINTERS, Plot No. 33 & 34, 2nd Floor, Vasthu Colony, LB Nagar, Ranga Reddy, Telangana - 500074 and Published at H.No. 10-1-101/10. Bhagya Nagar Colony, Lingojiguda, Saroornagar, Ranga Reddy, Telangana - 500035. EDITOR: SITARALLA SRIRAMULU , RNI. No. TELTEL/2015/62524. Cell: 9966443465